తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల

వనపర్తి | నారాయణపేట

నాగర్ కర్నూల్

శనివారం

01 ఆగస్టు 2026




## వానలతో ఊపందుకున్న వరి సాగు..

- నాట్లతో కళకళలాడుతున్న పొలాలు

**గోపాల్‌పేట, జూలై 31(జనంసాక్షి):** ఇటీవల కురిసిన వర్షాలతో సాగునీటి వనరులు సమృద్ధిగా లభించడంతో రైతులు వరినాట్ల పనులను ముమ్మరం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో పొలాలు నీటితో నిండిపోగా, మహిళా కూలీలు బురద నీటిలో గంటల తరబడి శ్రమిస్తూ వరి నాట్లు వేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే పొలాల్లోకి దిగిన కూలీలు వరుసల వారీగా వరి మొక్కలను నాటుతూ వ్యవసాయ పనులకు వేగం తెచ్చారు.

వానలు అనుకూలంగా కురవడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ సీజన్‌లో మంచి దిగుబడి సాధించాలని రైతులు ఆకాంక్షిస్తున్నారు. మరోవైపు, వ్యవసాయ పనులు ఊపందు కోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. అయితే కూలీల కొరత కారణంగా రోజువారీ కూలీ రేట్లు కూడా పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు.

ప్రస్తుతం గోపాల్‌పేట మండల వ్యాప్తంగా వరి నాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. ప్రకృతి సహకారం ఇలాగే కొనసాగితే ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయని వ్యవసాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నీటితో నిండిన పొలాల్లో మహిళా కూలీలు సమష్టిగా నాట్లువేస్తున్న దృశ్యాలు వ్యవసాయ సంస్కృతిని మరోసారి ప్రతిబింబిస్తున్నాయి.

## గుంతల గండం.. ప్రాణాలపై పందెం!

- రామాయంపేట-సిద్దిపేట రోడ్డుపై నిత్యం ప్రమాదాల పరంపర..
- మరమ్మతులకు మున్సిపాలిటీ మౌనం..



**రామాయంపేట, జూన్ 31(జనంసాక్షి):**
రామాయంపేట మున్సిపల్ పట్టణంలోని సిద్దిపేట ప్రధాన రహదారి గుంతల మయంగా మారి ప్రయాణికుల ప్రాణాలతో చెలగాట మాడుతోంది. వర్షాలకు తోడు అధికారుల నిర్లక్ష్యంతో రోడ్డంతా ప్రమాదకర గుంతలతో నిండిపోవడంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా యూరియా బస్తాలు తీసుకెళ్తున్న ఓ రైతు ద్విచక్ర వాహనంతో గుంతలో పడిపోవ డంతో స్వల్ప గాయాల పాలయ్యాడు. అయినప్పటికీ రోడ్డు మర మ్మతులపై మున్సిపల్ అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామాయంపేట పట్టణం నుంచి సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం అధ్వాన్న స్థితికి చేరుకుంది. రహదారిపై చోటుచేసుకున్న భారీ గుంతలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తాజాగా ఓ రైతు తన ద్విచక్ర వాహనంపై యూరియా బస్తాలు తీసుకుని ఇంటికి వెళ్తుండగా రోడ్డులోని గుంత కనిపించక వాహనం అదుపుతప్పి కిందపడిపోయాడు. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలు కాగా, పెద్ద ప్రమాదం తప్పింది. ఇలాంటి సంఘట నలు తరచూ జరుగు తున్నప్పటికీ సంబం ధిత అధికారులు మాత్రం చూసీ చూడ నట్లు వ్యవహరిస్తు న్నారని ప్రజలు మండిపడుతున్నారు. ప్రతిరోజూ వందలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ రహదారిని వినియోగిస్తున్నారని, గుంతల కారణంగా వాహనాలు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాల భయం వెంటాడుతోందని స్థానికులు చెబుతున్నారు.

ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పలుమార్లు హామీలు ఇచ్చినా పనులు మాత్రం ముందుకు సాగడం లేదని విమర్శిస్తున్నారు. "ప్రమాదం జరిగితేనే అధికారులకు కళ్లు తెరుచుకుంటాయా?" అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు మరమ్మతులను వెంటనే చేపట్టి ప్రజల ప్రాణా లను కాపాడాలని, లేకుంటే ఆందోళన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

## పదవీ విరమణ ముగింపు కాదు... కొత్త ప్రారంభం

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 31(జనం సాక్షి):** అంకితభావంతో విధులు నిర్వర్తించడం గొప్ప విషయ మని, అదే ఒక నిజమైన ప్రభుత్వ ఉద్యోగి లక్షణమని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నా రు. శుక్రవారం నారాయణపేట జిల్లా కోస్గి పట్ట ణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కోస్గి తహసీల్దార్ బక్క శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక, కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎ.తిరుపతి రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందిన తహసీ ల్దార్ శ్రీనివాస్ దంపతులను జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ శాఖలో దాదాపు 39 సంవత్సరాలపాటు నిజాయితీగా, నిబద్ధతతో సేవలందించి పదవీ విరమణ పొందుతున్న శ్రీనివాస్‌ను సన్మా నించడం ఆనందంగా ఉందన్నారు. తాను జిల్లాకు వచ్చి మూడు నెలలు మాత్రమే అయినప్పటికీ, ఈ మూడు నెలల్లో జరిగిన ప్రతి సమీక్షా సమావేశానికి శ్రీనివాస్ తప్పకుండా హాజరుకా వాలని సూచించానని, ఏ విషయాన్ని అయినా పూర్తిగా అర్థం చేసుకుని, ఎంతో స్పష్టంగా వివరించే వారని, ఆయన వివరించిన తర్వాత ఇతర తహసీ ల్దార్లకు కూడా పని పురో గతి, చేయాల్సిన పనులు, లోపాలు వంటి అంశాలు సులభంగా అర్థమయ్యేవని పేర్కొన్నారు. అదే శ్రీనివాస్ ప్రత్యేకత అని ఆమె కొని యాడారు. పదవీ విరమణ కార్యక్రమం జరుగుతున్న సమయంలో కూడా తన పక్కన కూర్చొని భూసేక రణ పనుల పురోగతిపై వివరాలు అందించారని కలెక్టర్ తెలిపారు. "నిన్న ఇంత పూర్తయింది, ఈరోజు ఇంత పూర్తయింది, ఈ తేదీకి పూర్తి అవుతుంది" అంటూ ఎంతో బాధ్యతతో వివరించారని, పదవీ విరమణ పొందుతున్న రోజున కూడా తన బాధ్యతను మరవకుండా చివరి క్షణం వరకు పనిపట్ల అదే శ్రద్ధ, అంకితభావం ప్రదర్శించడం నిజంగా అభినందనీయమని అన్నారు. కోస్గి వంటి కీలక మండలంలో, ముఖ్యమం త్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియో జకవర్గ పరిధిలో, మున్సిపా లిటీతో అనుసంధానమైన ప్రాంతంలో వరుసగా మూడు సంవత్సరాలు ఎలాంటి ప్రతికూల వ్యాఖ్య లు లేకుండా, అందరి ప్రశంసలు అందుకుంటూ సేవలందించడం చిన్న విషయం కాదన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, సహోద్యోగు లు, స్నేహితులు, కుటుంబ సభ్యులు ఇంత పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరై శ్రీనివాస్‌ను అభినం దించడం ఆయన వ్యక్తి త్వానికి, సేవలకు నిదర్శ నమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనేది జీవితంలో ఒక ముగింపు కాదని, అది ఒక కొత్త ప్రారంభమని కలెక్టర్ అన్నారు. ఇకపై కుటుంబ సభ్యులు, పిల్లలు, మనవ లు, మనవరాళ్లతో కలిసి ఆరోగ్యంగా, ఆనందంగా, ప్రశాంతంగా జీవితాన్ని గడపాలని ఆమె ఆకాం క్షించారు. అలాగే శ్రీనివాస్ అనుభవం జిల్లాకు ఇంకా ఎంతో అవసరమని, ముఖ్యంగా యువ అధికా రులకు, తహసీల్దార్లకు ఆయన మార్గదర్శకత్వం భవిష్యత్తులో కూడా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పదవీ విరమణ తో ఆయన సేవలు ముగిశా యని తాను భావించడం లేదని, అవసరమైనప్పుడు ఆయన అనుభవం, సల హాలు జిల్లా యంత్రాంగానికి ఎప్పటికీ దిక్సూచిగా ఉంటాయని అన్నారు.

ఈ సందర్భంగా శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినం దనలు తెలియజేస్తూ, ఆయన సంపూర్ణ ఆరోగ్యం తో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నారాయ ణపేట, వికారాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు శ్రీను, వెంకటాచారి, డీఆర్వో రాజేశ్వరి, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, ఆర్డీవో రమేష్, డిప్యూటీ కలెక్టర్ ఫణికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎంపీడీవో శ్రీధర్, జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ అధికారులు, కోస్గి తహసీల్దార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఖాజీపూర్ గ్రామంలో అభివృద్ధి పనుల తనిఖీ



**మద్దూరు, జూలై 31 (జనంసాక్షి):**
మద్దూర్ మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ ఖలీల్ ఖాజీపూర్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని శానిటేషన్ నిర్వహణ, సి ఆర్ ఆర్ పనులు, అండర్ డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్డు పనులను పరిశీలించి వాటి పురోగతిని సమీక్షించారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ ఖలీల్, గ్రామ సర్పంచ్ ఎం. సాయప్ప, ఉపసర్పంచ్ భీమమ్మ, పంచాయతీ కార్యదర్శి ఎం.డి. షాజిల్, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా రహదారులు చర్యలు కోరుతున్న ప్రజలు...



**గద్వాల జూలై 31(జనంసాక్షి):**
గద్వాల మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వాన్నంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గద్వాల నుంచి వెంగంపేట, తురు కోన్పల్లి, ములకలపల్లి, తెలు గోనిపల్లి, లత్తిపురం, బీరెల్లి, గుర్రంగడ్డ గ్రామాలకు వెళ్లే మార్గాలు గుంతలమయంగా మారాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో రహదారి పరిస్థితి అర్ధంకాక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఎన్నో ఏళ్లుగా రహదారి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణం ఇబ్బందికరంగా మారిందని పేర్కొంటున్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి రహదారుల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కలెక్టర్ స్పందించి సమస్యకు పరిష్కారం చూపుతారనే ఆశాభావాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

# యువశక్తే బీఆర్ఎస్‌కు బలం

- పార్టీ బలోపేతంలో యువత పాత్ర కీలకం
- మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు శుభాకాంక్షలు
- బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి





**మెదక్ టౌన్, జులై 31, (జనంసాక్షి):** బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువతే ప్రధాన శక్తి అని, ప్రజా సేవే యువ నాయకుల లక్ష్యంగా ఉండాలని బీఆర్ ఎస్ జిల్లా నాయకుడు కంఠరెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నిజాంపేట్ మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు మావురం రాజు జన్మదిన వేడుకలను హైదరాబాద్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కంఠరెడ్డి తిరుపతిరెడ్డి మావురం రాజుతో కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువాతో సన్మానించి పార్టీ కోసం ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. గ్రామస్థాయిలో పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మావురం రాజు చురుకైన పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.యువశక్తి చైతన్యంతోనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పేర్కొన్న ఆయన.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాల్లో ముందుండాలని యువతకు సూచించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే వారికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని, మావురం రాజు పార్టీకి, ప్రజలకు మరింత విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు. పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషిచేస్తే బీఆర్ఎస్ మరింత బలోపేతం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మావురం రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ పిఏసిఎస్ చైర్మన్ పప్పుల బాపురెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కసిరెడ్డి మాణిక్య రెడ్డి,ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మెన్ బాలాగౌడ్, పాపన్నపేట్ మాజీ మార్కెట్ చైర్మెన్ వెంకట్రామిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు కొత్తూరి. శ్రీనివాస్ బిఆర్ఎస్వి నియోజకవర్గ నాయకులు గంజి నవీన్,రాజక్పల్లి సర్పంచ్ కనకరాజు, నాయకులు సొంగు స్వామి, రవి సెట్, మోహన్ రెడ్డి, నరేందర్, పరిశరములు, మధవత్ రాజు, వార్డు మెంబర్ పంపర నగేష్, నాస్కల్ ఏలం యాదవ్, బన్నీ,సాయి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రక్త నమూనాల సేకరణ, రక్త వర్గీకరణపై అవగాహన

- అన్నారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం



**గుమ్మడిదల, జూలై 31 (జనంసాక్షి):** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రక్త నమూనాల సేకరణ, రక్త వర్గీకరణ (బ్లడ్ గ్రూపింగ్) ప్రక్రియపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త నమూనాలను ఎలా సేకరిస్తారు, రక్త వర్గాలను ఎలా గుర్తిస్తారు, రక్తదానం యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య పరీక్షల అవసరం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ మీనాకుమారి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానాలు ఇచ్చి, ఆరోగ్య పరిరక్షణపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆసక్తిగా వీక్షించారు.

# వరి పొలాలు సందర్శించిన వ్యవసాయ అధికారి సతీష్



**కోహెడ, జూలై 31 (జనంసాక్షి):** మండలంలోని శ్రీరాములపల్లి గ్రామంలోని పలువురి రైతుల వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి సతీష్ సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాట్లు వేసుకునే వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఇసుకలో కలిపి చల్లుకోవాలి. అలాగే తరచుగా వరి కాండం తొలుచు పురుగు ఆశించే ప్రాంతాలలో ముందస్తు చర్య నివారణలో భాగంగా ఎకరానికి 10 కిలోల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను వరి నాటిన 15 రోజులకు వేసుకోవడం ద్వారా కాండం తొలుచు పురుగు, ఉల్లి కోడును నివారించుకోవచ్చునని ఏ ఓ తెలిపారు. నీరు ఆలస్యంగా వచ్చి దీర్ఘకాలిక వరి రకాల నారు నాటు పెట్టుకోవడం ఆలస్యమైన ప్రాంతాలలో, 50రోజుల వయస్సు ఉన్న నారు ఆకు చివరలను త్రుంచి వేసి కుదురుకు 5 నుండి 6 మొక్కల చొప్పున నాటువేయాలని రైతులకు తెలిపారు. నాటు పెట్టిన తర్వాత ప్రతి 2 మీటర్లకు కాలిబాటను తీయటం వలన గాలి వెలుతురూ బాగా ప్రసరించడంతో బాటు సుడిదోమ ఉధృతిని నివారించవచ్చు. అదేవిధంగా రైతులు ఎరువులు, పురుగు మందులు పంటకు అందించడానికి సులువుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు శివకుమార్, మహిపాల్ రెడ్డి, రఘు రైతులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రాగుల వెంకటేష్, గడ్డం మహిపాల్ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

- మండల విద్యాధికారి విద్యాసాగర్



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 31(జనంసాక్షి):** పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని మండల విద్యాధికారి విద్యాసాగర్ సూచించారు. శుక్రవారం సంగారెడ్డి స్థానిక సెయింట్ ఆన్స్ పాఠశాలలో నూతన విద్య సంవత్సరానికి గాను ఎంపికైన పాఠశాల విద్యార్థి నాయకులు, అసిస్టెంట్ ఆర్డర్లు, హౌస్ కెప్టన్లు, ఇతర విద్యార్థి సాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి విద్యాసాగర్ హాజరైనారు. పాఠశాల కరస్పాండెంట్ కె.అంథోని రెడ్డి తో కలిసి ఉపాధ్యాయబృందం జ్యోతిప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఎంఈఓ, ప్రధానో పాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలపై దృష్టి సారించాలన్నారు.

నాయకత్వం అనేది బాధ్యతతో కూడుకున్న సేవ అన్నారు. విద్యార్థులు, నాయకులు క్రమశిక్షణ నిజాయితీ సమయపాలన, సేవాభావంతో ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. పాఠశాల ప్రతిష్ఠను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్ళేందుకు ప్రతీ నాయకుడు తమవంతు బాధ్యతను సమర్థమంతంగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, ఆదర్శ పథంలో ముందుకు వెళ్ళాలని ప్రోత్సహిస్తూ బ్యాడ్జీలు అందజేసారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి-పాఠశాల కరస్పాండెంట్ కె.అంథోని రెడ్డి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి

- విద్యుత్ స్తంభాలు, తెగిన తీగలకు దూరంగా ఉండండి: కోహిర్ ఎస్ఐ నరేష్



**కోహిర్, జూలై 31 (జనంసాక్షి):** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోహిర్ ఎస్ఐ నరేష్ సూచించారు. వర్షాల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల వద్దకు వెళ్లకుండా దూరంగా ఉండాలని తెలిపారు. ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో చెట్ల కింద నిలబడకుండా సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. అత్యవసరమైతే తప్ప అనవసరంగా ప్రయాణాలు చేయవద్దని, వాగులు, వంకలు, చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని. కోహిర్ ఎస్ఐ నరేష్ కోరారు. వరద నీటిని దాటే ప్రయత్నం చేయడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసు శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సహాయం కోసం 100 (పోలీస్), 108 (అంబులెన్స్), 1077 (విపత్తు నిర్వహణ), 112 (అత్యవసర సేవలు) నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ప్రజల భద్రతే తమ బాధ్యత అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి కుటుంబ సభ్యుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఐ నరేష్ విజ్ఞప్తి చేశారు.

# తపస్ ధర్నాను జయప్రదం చేయండి

**మల్దకల్ జూలై 31 (జనంసాక్షి):** ఉపాధ్యాయులు డిమాండ్ల సాధన కోసం ఆగస్టు1న హైద్రాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు తపస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,జిల్లాఅధ్యక్ష ప్రధానకార్యదర్శులు రవీందర్ రెడ్డి,నాగరాజులు తెలిపారు.ఈ ధర్నాకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలిని కోరారు.

51% ఫిట్మెంట్ ప్రకటించాలని,6 పెండింగ్ లోఉన్న డిఎలను విడుదల చెయ్యాలని,317 GO బాధితులకు న్యాయం చేయాలి అని,సిపిఎస్ ను రద్దు చేయాలిని, పెన్షనర్ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలిని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమములో గద్వాల అధ్యక్ష కార్యదర్శులు వెంకటేష్,రవి,జిల్లా ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్ సేవా విభాగ్ కన్వీనర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ఇన్‌స్టాగ్రామ్ ఫిర్యాదుకు వెంటనే స్పందన

- డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో చైర్‌పర్సన్ రత్నమాల పర్యటన
- ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం..కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ రత్నమాల



**కల్వకుర్తి,జులై31(జనంసాక్షి):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల మరోసారి చొరవ చూపారు. డబుల్ బెడ్‌రూమ్ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్థానిక సమస్యలను తెలియజేయడంతో ఆమె వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాన్ని సందర్శించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రత్నమాల మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే మా తొలి ప్రాధాన్యం. నేరుగా వచ్చినా, సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదు చేసినా ప్రతి సమస్యపై వెంటనే స్పందిస్తాం. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం" అని తెలిపారు.

సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించి చర్యలు చేపట్టడంపై కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు,యువజన కాంగ్రెస్ నాయకుడు దున్న సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నాసాలో సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులకు ఎమ్మెల్యే సత్కారం



**గద్వాల జూలై 31(జనంసాక్షి):** నాసా నిర్వహించిన పోటీల్లో జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. గద్వాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు శాలువాలు కప్పి అభినందిస్తూ వారి ప్రతిభను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞాన, సాంకేతిక రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం పాఠశాలకు,గద్వాల ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులు, గురువులు ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.నాసాలో ద్వితీయ బహుమతి సాధించిన నేహా,సుమన శ్రీ,సుహాస్,గౌతమ్, సహస్ర, మోహన్, నిహాల్, ఫర్హాన్, కౌశిక్, వినయ్, నితిన్, నితేష్‌లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ విజయరత్నం,డీన్ మధు,పలువురు నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం

# ఎనలేని కృషి చేసిన మహాఉద్యమ నేత పెద్ది

- చేర్యాల మాజీ ఎంపిపీ డా. పరమేశ్వర్
- పెద్ది మరణం ఉమ్మడి వరంగల్ జిల్లాకు తీరని లోటు



**చేర్యాల, జులై 31(జనంసాక్షి):** వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి ఉమ్మడి వరంగల్ జిల్లాకు, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు భారీ నష్టమని చేర్యాల మాజీ ఎంపిపీ డాక్టర్ రామగళ్ళ పరమేశ్వర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం అక్షయ ఆసుపత్రిలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రజా నాయకుడిగా, తెలంగాణ ఉద్యమంలో ఆయనతో ఎండ్ల తరబడి ఉద్యమములో కలిసి కీలకంగా పనిచేశామని కొనియాడారు. నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్‌తో కలిసి ఎనలేని కృషి చేసిన మహా ఉద్యమ నేత పెద్ది అని అన్నారు. పేద ప్రజల కోసం, రైతుల కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప నాయకుడిని కోల్పోయామని, ఆయన మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ది సుదర్శన్ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పే స్కేల్ వేతనాల సమస్యలను పరిష్కరించాల్సిందే

- కొనసాగుతున్న ఈజీఎస్ అధికారుల సహాయ నిరాకరణ



**న్యాల్‌కల్, జులై 31, (జనంసాక్షి):** జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న అధికార సిబ్బందికి గత కొంతకాలంగా వేధిస్తున్న పే స్కేల్,వేతనాల విడుదల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న.."సహాయ నిరాకరణ" నిరసన రెండవ రోజుకు చేరుకుంది. జాతీయ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్)లో విధులు నిర్వహిస్తున్న అధికార సిబ్బంది శుక్రవారం న్యాల్‌కల్‌లోని మండల పరిషత్ కార్యాలయ భవనంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఆగస్టు 4 వరకు రోజువారీగా ప్రకటించిన నిరసన కార్యక్రమంలో భాగంగా.."సహాయ నిరాకరణ" నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఏపీఓ రంగారావు తెలిపారు. మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, వెంటనే చెల్లించాలని.. పే స్కేల్ సమస్యను త్వరితగతిన అమలు చేసి ఆదుకోవాలని నిరసనకారులు ప్రభుత్వం, ప్రభుత్వ యంత్రాంగానికి డిమాండ్ చేశారు. నిరసన తెలిపిన వారిలో.. ఈజీఎస్ సిబ్బంది హనుమంతు, వెంకట్రావు, రాము, నరసింహారెడ్డి, మొగులయ్య, సమ్మయ్య, తదితరులు ఉన్నారు.

## బాధ్యతల నుండి

# స్వచ్ఛందంగా తప్పుకున్న న్యాల్ కల్ కేజీబీవీ ఎస్ఓ

- ఇన్చార్జి ఎస్ఓగా సంగీత



**న్యాల్‌కల్, జులై 31, (జనంసాక్షి):** వ్యక్తిగత కారణాల దృష్ట్యా న్యాల్ కల్ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ) రుబీనా పర్వీన్ బాధ్యతల నుండి స్వచ్ఛందంగా (రిజైన్) తప్పుకున్నారని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలల జిల్లా ప్రత్యేకాధికారిణి (జీసీడీఓ) సునీత ఖన్నా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 31 నుండి స్వచ్ఛందంగా తప్పుకోవడంతో.. ఇన్చార్జి ప్రత్యేకాధికారిణి (ఎస్ఓ)గా సంగీత (సీనియర్)ను ఇన్చార్జిగా బాధ్యతలను అప్పగించినట్లు జీసీడీఓ తెలిపారు.

# పోలీస్‌కు గ్రామస్థుల సన్మానం



**అల్లాదుర్గం జూలై 31 (జనంసాక్షి):** మండలంలోని బహిరన్ దిబ్బ గ్రామానికి చెందిన బోయిని జానార్ధన్ సిద్దిపేట జిల్లాలో పోలీసుగా విధులు నిర్వహిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ స్థాయి నుండి ఏ ఎస్సైగా పదోన్నతి పొంది తన స్వగ్రామానికి వచ్చిన జనార్ధన్‌ను గ్రామస్తులు పూలమాల శాలువాతో సన్మానించి స్వీట్లు తినిపించి ఆయనకు పదోన్నతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరప్ప మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా పదోన్నతి తో బాధ్యత మరింత పెరిగిందన్నారు. పుట్టిన ఊరును దృష్టిలో పెట్టుకొని గ్రామ యువత సన్మార్గంలో నడవాలని సూచించే జనార్ధన్ సార్ ను గ్రామ యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తమ గ్రామస్తుడు ఏ ఎస్సైగా పదోన్నతి పొందడం ఎంతో సంతోషంగా ఉందని జనార్ధన్ ఇంకా ఎన్నో ఉన్నత పదోన్నతులు పొందాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియ జేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరులు సర్పంచ్ వీరప్ప,ఉప సర్పంచ్ శ్రీకాంత్, నాయకులు ప్రభు, ఫీల్డ్ అసిస్టెంట్ శివానందం, గాలప్ప, శివప్ప, శరణప్పా తదితరులు పాల్గొన్నారు.

# పర్వతాపూర్ పుష్పలవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టాలి

- రైతులకు తక్షణ నష్టపరిహారం చెల్లించాలి
- భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాల్‌రాజ్



**రామయంపేట, జులై 31 (జనంసాక్షి):** రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ సమీపంలోని పుష్పలవాగు బ్రిడ్జిని భారతీయ జనతా పార్టీ బృందం ఈరోజు పరిశీలించింది. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు పుష్పలవాగు బ్రిడ్జి ఇరువైపులా పూర్తిగా కొట్టుకుపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటన వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీ వరదల కారణంగా వందల ఎకరాల్లో వరి పంట కొట్టుకుపోయి, పొలాల్లో ఇసుక మెట్టలు పేరుకుపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందజేస్తామని ప్రకటించినప్పటికీ, ఏడాది గడిచినా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా చెల్లించకపోవడం అత్యంత దురదృష్టకరం, సిగ్గుచేటు. తాత్కాలికంగా రాకపోకలు పునరుద్ధరించేందుకు బ్రిడ్జి ఇరువైపులా మట్టిని నింపినప్పటికీ, ఆ పనులు చేసిన కాంట్రాక్టర్లు, వ్యక్తులకు ఇప్పటి వరకు ఒక్క రూపాయి బిల్లు కూడా చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం. గత వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో బ్రిడ్జి పరిస్థితిని పరిశీలించిన బీజేపీ బృందం అక్కడి పరిస్థితులను పంచాయతీరాజ్ డీఈ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లింది. గత సంవత్సరం నుంచే జిల్లా కలెక్టర్, పంచాయతీరాజ్ అధికారులు, ఏఈలకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసి, శాశ్వత నిర్మాణం చేపట్టాలని కోరినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. లక్ష్మాపూర్-పర్వతాపూర్-కిషన్ తండా-దంతపల్లి రహదారులు పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలతో ప్రమాదకరంగా మారాయి. చిన్న వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత మూడు రోజుల క్రితం ఆర్టీసీ డీఎం స్వయంగా పరిశీలించి, రోడ్ల దుస్థితి కారణంగా బస్సు సర్వీసులను నిలిపివేశారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని బస్సులు నడపాలని కోరినా, ప్రస్తుతం ఉన్న ప్రమాదకర పరిస్థితుల్లో బస్సులు నడపడం సాధ్యం కాదని అధికారులు స్పష్టం చేశారు. గత సంవత్సరం నుంచే మెదక్ పార్లమెంట్ సభ్యులు శ్రీ రఘునందన్ రావు ద్వారా జిల్లా కలెక్టర్, డీఈ, ఏఈలకు పలుమార్లు ఈ సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి కనిపించలేదు. ప్రస్తుతం మరోసారి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బ్రిడ్జి మరింత ప్రమాదకర స్థితికి చేరుకుంది. అందువల్ల ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పర్వతాపూర్ పుష్పలవాగు బ్రిడ్జికి శాశ్వత నిర్మాణం చేపట్టాలి. బ్రిడ్జి ఇరువైపులా రక్షణ గోడలు, శాస్త్రీయ నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. లక్ష్మాపూర్-పర్వతాపూర్-కిషన్ తండా-దంతపల్లి రహదారులపై ఉన్న గుంతలను అత్యవసరంగా పూడ్చి రాకపోకలను సురక్షితంగా చేయాలి. గత సంవత్సరం వరదల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలి. తాత్కాలిక మరమ్మతుల పనులు చేసిన వారికి పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలి. లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు, దంతపల్లి సర్పంచ్ బాల్‌రాజ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# బాల్య వివాహాల నివారణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలి

- బాల్య వివాహాలు ఆపుదాం... బాలల భవిష్యత్తును భద్రపరుచుదాం
- సంగాయిపేటలో విజన్ ఎన్జీవో ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం





**కొల్చారం, జులై 31 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని సంగాయిపేట గ్రామంలో విజన్ ఎన్జీవో ఆధ్వర్యంలో సంగాయిపేట అంగన్వాడీ సెక్టార్ సమావేశంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుపై కలిగే ప్రతికూల ప్రభావాలను ప్రతినిధులు వివరించారు. 18 సంవత్సరాల లోపు బాలికలకు, 21 సంవత్సరాలలోపు బాలురకు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టడంలో అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు, తల్లిదండ్రులు సమిష్టిగా బాధ్యత వహించాలని సూచించారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు లేదా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజన్ ఎన్జీవో ప్రతినిధులు పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం దెబ్బతినడం, విద్యకు ఆటంకం కలగడం, మానసిక ఒత్తిడి పెరగడం, చిన్న వయసులో గర్భధారణ ప్రమాదకరంగా మారడం, భవిష్యత్తు అవకాశాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడతాయని వివరించారు. "బాల్య వివాహాలు ఆపుదాం... బాలల భవిష్యత్తును భద్రపరుచుదాం" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ శ్రీదేవి, అంగన్వాడీ టీచర్లు, విజన్ ఎన్జీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎల్లమ్మ బోనాలు..

- ఎల్లమ్మ జాతరలో భక్తి పారవశ్యం..
- కోడిపుంజులు, బోనాలతో మొక్కులు..
  మండలవ్యాప్తంగా పండుగ శోభ..



**మహమ్మదాబాద్,జులై 31(జనంసాక్షి):** మహమ్మదాబాద్ మండలంలోని దేశాయిపల్లి, మహమ్మదాబాద్, కంచన్‌పల్లి, గాధిర్యాల్, మంగంపేట్ తదితర గ్రామాల్లో శుక్రవారం ఎల్లమ్మ బోనాల పండుగను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడగా, అమ్మవారి దర్శనం కోసం మహిళలు, యువత, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలను తలపై మోసుకుంటూ ఆలయాలకు చేరుకుని ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు నెరవేరిన భక్తులు అమ్మవారికి కోడిపుంజులు,నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణాలు మంగళవాయిద్యాలు, డప్పు చప్పుళ్ళు, మధ్యలో భక్తుల అమ్మవారి కటాక్షంతో కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.గ్రామ పెద్దలు,ప్రజాప్రతినిధులు కూడా వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమాలు నిర్వహించగా,భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలు తెలంగాణకు ప్రత్యేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయంగా కొనసాగుతున్నాయి. ఎల్లమ్మ, మహంకాళి వంటి గ్రామదేవతలకు కృతజ్ఞతగా భక్తులు బోనం సమర్పించడం ఈపండుగ ప్రధాన విశిష్టత.మండలవ్యాప్తంగా భక్తుల రాకపోకలతో ఆలయాల పరిసరాలు సందడిగా మారాయి.గ్రామాలన్నీ పండుగ శోభను సంతరించుకోగా,ఎల్లమ్మ తల్లి నామస్మరణతో భక్తి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# విటూహెల్ప్‌యూ ఫౌండేషన్ సేవలు ఆదర్శనీయం

- మండల పిఆర్‌టియు అధ్యక్షులు శేరికార్ రమేష్



**నాగల్గిద్ద, జులై 31 (జనంసాక్షి):** నాగల్గిద్ద మండలంలోని ముక్త పూర్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విటూహెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.45 వేల విలువైన స్కూల్ బ్యాగులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు క్రిష్ణ ప్రసాద్, అమర్నాథ్, సావిత్రి పాల్గొని బ్యాగు లను అందజేశారు.

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ, వి టూ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థుల పట్ల చూపు తున్న సేవాభావం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసర మైన విద్యా సామగ్రిని అందించడం ద్వారా వారి చదువుపై మరింత ఆసక్తి పెరుగు తుందని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని సంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు క్రిష్ణ ప్రసాద్, అమర్నాథ్, సావిత్రిని రమేష్ సార్ ప్రత్యే కంగా అభినందించి, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుభాష్ చంద్రబోష్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లలిత, ప్రధానోపాధ్యాయులు బాబు శెట్టి, ఉపాధ్యాయులు లింగమేశ్వర్, సంగమేశ్వర్, స్థానిక ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చాడ వెంకట్ రెడ్డిని కలిసిన ఆకునూరు సర్పంచ్

- కాంగ్రెస్-సీపీఐ మిత్రపక్షంపై చర్చ



**చేర్యాల, జులై 31(జనంసాక్షి):** సీపీఐ మాజీ శాసనసభా పక్ష నేత, జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డిని ఆకునూరు గ్రామ సర్పంచ్ కొమ్ము రవి శుక్రవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్ లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్–సీపీఐ మిత్రపక్షం గురించి విస్తృతంగా చర్చించారు. భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి పనిచేయాలని ఇరువురు నిర్ణయించుకున్నారు. ప్రజా సంక్షేమం, గ్రామ అభివృద్ధి కార్యక్రమాలలో కలిసి ముందుకు సాగాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. సీపీఐ–కాంగ్రెస్ మిత్రపక్షం బలోపేతం కోసం గ్రామ స్థాయి నుంచే కార్యక్రమాలు చేపట్టాలని చాడ వెంకటరెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ము రవి మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి మిత్రపక్షమైన సిపిఐ పార్టీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. గ్రామంలో ఇటీవల చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సర్పంచ్‌ను చాడ వెంకట్ రెడ్డి అభినందించారు. ఈ సమావేశంలో స్థానిక గ్రామ కాంగ్రెస్ నాయకులు కోయినేని బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బూట్ల పంపిణీ



**మద్దూరు, జూలై 31 (జనంసాక్షి):** జడ్.పి.హెచ్.ఎస్ పల్లెర్ల పాఠశాలలో శుక్రవారం రోజు విద్యార్థులకు బూట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటరెడ్డి, ఉపసర్పంచ్ లక్ష్మీ వెంకట్రాం రెడ్డి, ఎక్స్ ఎన్ పి టి సి సంజయ్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు హనుమంతు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కృష్ణమ్మ, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ గౌడ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు కూడా ఆత్మస్థైర్యంతో గౌరవంతో విద్యను అభ్యసించేటట్లుగా చేయడంలో భాగమే ఈ విద్యార్థులకు బూట్లు పంపిణీ కార్యక్రమం అని ఇది గ్రామీణ పేద విద్యార్థులలో ధైర్యాన్ని నింపుతుందని వారు చక్కటి విద్యను అభ్యసించడానికి ఒక పునాది అవుతుందని అభిప్రాయ పడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ నేపద్యమే వారు ఎదిగిన క్రమంలో చవిచూసిన విషయాలను దృష్టిలో ఉంచుకొని నేడు ఈ పేద విద్యార్థుల పట్ల ఆలోచన చేయటం హర్షనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, వీరేందర్ గౌడ్, రాజు నాయక్ ,అనిల్ నాయక్, రాములు, హరి సుధన్ రెడ్డి పాల్గొన్నారు.

# పెండింగ్ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- నేడు ఇందిరా పార్క్ వద్ద తపస్ మహాధర్నా
- మహా ధర్నాకు ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలి
- తపస్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్



**సంగారెడ్డి ప్రతినిధి, జులై 31 (జనంసాక్షి):** పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరిచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో ఆయన మాట్లాడుతూ...

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదని ఆయన విమర్శించారు. పీఆర్సీ గడువు ముగిసి మూడు సంవత్సరాలు గడిచినా నివేదిక తెప్పించి ఫిట్‌మెంట్ ప్రకటించకపోవడం, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండడం, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల వారికి సకాలంలో వైద్యం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉద్యోగుల వేతనాల నుంచి రెండు నెలలుగా 1.5 శాతం కోత విధిస్తున్నప్పటికీ హెల్త్ కార్డులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కాలేదని తెలిపారు. అలాగే నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని అన్నారు.

ఈ సమస్యలపై పలుమార్లు ప్రభుత్వాన్ని కోరినా స్పందన లేక పోవడంతో తపస్ ఉద్యమ కార్యాచరణ చేపట్టిందని, ఇప్పటికే మండల, జిల్లాస్థాయి ధర్నాలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం స్పందించక పోవడంతో ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న మహా ధర్నా కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున తరలిరావాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు.

# చిలప్ చేడ్ పాఠశాలలో విద్యార్థులకు చైతన్యం....

- మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థుల అవగాహన కార్యక్రమం
- పరిశుభ్రతపై ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక కార్యక్రమం



**చిలప్‌చేడ్, జూలై 31 (జనంసాక్షి):** మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల విద్యార్థులు రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ (RAWEP) కార్యక్రమంలో భాగంగా చిలిపిచేడ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలు సామాజిక, ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. పోషకాహార లోపం నివారణ, స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తోటి విద్యార్థులతో మర్యాదగా మెలగడం వంటి అంశాలపై విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. చిన్ననాటి నుంచే మంచి అలవాట్లు అలవరచుకుంటే ఆరోగ్యవంతమైన, బాధ్యతగల పౌరులుగా ఎదగవచ్చని సూచించారు.

అనంతరం ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అనిల్ విద్యార్థులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని పరిశుభ్రమైన పాఠశాల, పరిశుభ్రమైన గ్రామ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీరాములు, వార్డు సభ్యుడు కృష్ణ, ఉపాధ్యాయులు ఆది, ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మల్లారెడ్డి విశ్వవిద్యాలయం విద్యార్థులు హారిక, హరిని, లావణ్య, నికిత, వందిత చురుకుగా పాల్గొని ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, క్రమశిక్షణ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పరిశుభ్రత పాటించడం, పోషకాహారం తీసుకోవడం, పెద్దలను గౌరవించడం, మంచి అలవాట్లను ఆచరిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే

- మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి 4 రోజుల జ్యుడీషియల్ రిమాండ్: మునిపల్లి ఎస్సై అరవింద్



**మునిపల్లి, జూలై 31(జనంసాక్షి):** మద్యం సేవించి వాహనాలు నడుపితే జైలు శిక్ష తప్పదని మునిపల్లి ఎస్సై అరవింద్ హెచ్చరించారు. మునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న వ్యక్తిని పోలీసులు పట్టుకుని న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. మునిపల్లి మండలంలోని

మాన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన పట్నశెట్టి సంగమేశ్వర్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. బ్రెత్ అనలైజర్ పరీక్షలో అతని రక్తంలో 550 ఎం జి/100 ఎం ఎల్ ఏ బి సి ( బ్లడ్ ఆల్కహాల్ కాంటెంట్ ) నమోదైంది.

నిందితుడిని గౌరవ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లక్ష్మీ కళ న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు 4 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం అతడిని సంగారెడ్డి కేంద్ర కారాగారానికి తరలించారు.

ఈ సందర్భంగా మునిపల్లి ఎస్సై మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా తో పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శాకాంబరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ ఊరడమ్మ అమ్మవారు



**జహీరాబాద్, జూలై 31 (జనంసాక్షి):** జహీరాబాద్ పట్టణంలోని గడిలో వెలసిన శ్రీ ఊరడమ్మ ఆలయంలో అమ్మవారిని శాకాంబరి దేవి అవతారంలో అత్యంత వైభవంగా అలంకరించారు.

కూరగాయలు, ఆకుకూరలు, వంకాయలు, బెండకాయలు, మిరప కాయలు, క్యాబేజీ, గుమ్మడికాయలు, కొబ్బరికాయలు, పూలతో ప్రత్యే కంగా చేసిన ఈ అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.

శాకాంబరి దేవి అలంకరణ ప్రకృతి సంపద, వ్యవసాయాభివృద్ధి, ప్రజల ఆరోగ్యం, సమృద్ధికి ప్రతీకగా భావిస్తారని ఆలయ నిర్వాహ కులు తెలిపారు.

ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హారతులు, తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆలయ కమిటీ అధ్యక్షులు పి.శ్రీకాంత్ రెడ్డి, నాయకులు సిద్దు రవి, పాండు, ఫవాన్, సుధాకర్, నాగరాజు, విక్రమ్,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ కార్మికులకు రైన్‌కోట్లు, సేఫ్టీ కిట్ల పంపిణీ

**తూప్రాన్, జూలై 31(జనంసాక్షి):** వర్షాకాలంలో నిరంతరం విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ తూప్రాన్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం రైన్‌కోట్లు, సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి బొంది రజిని రవీందర్ గౌడ్ మరియు మున్సిపల్ కమిషనర్ కె. రమేష్ కుమార్ పాల్గొని కార్మికులకు రైన్‌కోట్లు, సేఫ్టీ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బొంది రజినీ రవీందర్ గౌడ్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు అభినందనీయమని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రతకు మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. వర్షంలో విధులు నిర్వహించే సమయంలో రైన్‌కోట్లు, సేఫ్టీ కిట్లను తప్పనిసరిగా వినియోగించుకోవాలని కార్మికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు సత్యలింగం, దుర్గం నగేష్, చెలిమెల రాములు, బొద్దు రాధాకుమారి శ్రీనివాస్, ఐలేష్ మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెద్దిసుదర్శన్ రెడ్డి మృతి బాధాకరం

- జడ్పీకోఆప్షన్ మాజీ సభ్యులు మన్సూర్

**శివ్వంపేట, జూలై 31 (జనంసాక్షి):** మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బాధకరమని మెదక్ జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్ పేర్కొన్నారు. శుక్రవారం మన్సూర్ మాట్లాడుతూ పెద్ది సుదర్శన్ రెడ్డి ఉద్యమకారుడిగా, ఎమ్మెల్యేగా ఎన్నో సేవా కార్యక్రమాలు, పలు అభివృద్ధి పనులు చేసి ఆయన తెలంగాణ వ్యాప్తంగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి బీఆర్ఎస్ పార్టీకి సైతం తీరని లోటని మన్సూర్ సంతాపం ప్రకటించారు.

## గురుపీఠంలో చోరీ

- హుండీలు పగులగొట్టి నగదు అపహరణ
- రంగంలోకి దిగిన క్లూస్ టీం



**శివ్వంపేట, జూలై 31 (జనంసాక్షి):** శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో వెలసిన శ్రీ గురు పీఠంలో ఉన్న శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా దేవాలయాల్లో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. రెండు ఆలయాల హుండీలను పగులగొట్టి వాటిలో ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు. శుక్రవారం ఉదయం ఆలయ కార్యనిర్వాహకుడు సత్యనారాయణ గౌడ్ దేవాలయానికి వచ్చి పరిశీలించగా డోర్లు, హుండీలు పగులగొట్టిన విషయం గుర్తించి, ఆ వెంటనే ఆలయ చైర్మన్ జిన్నారం శివ కుమార్ గౌడ్‌కు సమాచారం అందించడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మధుకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని చేరుకొని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీం ను ఘటన స్థలానికి రప్పించి, అక్కడ వేలిముద్రలు, ఇతర ఆనవాళ్లను సేకరించారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పుటేజీలను కూడా పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఎర్రవల్లి ప్రాథమిక పాఠశాలకు రంగులు



**ఎర్రవల్లి జూలై 31(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఉండే ప్రాథమిక పాఠశాల భవనానికి ఎర్రవల్లి సర్పంచ్ శ్రీమతి అనిత కృష్ణసాగర్ రంగులు వేయించారు దీంతో పిల్లలు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేసి సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలిపారు సర్పంచ్ మాట్లాడుతూ వాళ్ళు అర్థ్ కావాలని పెయింటింగ్ కూడా వేయిస్తానని పిల్లలకు ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో దశరథం సాగర్ రాకేష్ పరమేష్ పాల్గొన్నారు.

### విద్యలో ప్రతిభ..

## ఉపాధ్యాయుడి చేయూత




**పాపన్నపేట, జూలై 31 (జనంసాక్షి):** పాపన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయుడు మంగ నర్సింలు తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. గాజులగూడెం ప్రభుత్వ బడిలో రెండో తరగతి చదువుతున్న విద్యార్థి ప్రేమ్ కుమార్ విద్య ప్రతిభను గుర్తించి రూ. 5116 చెక్కును అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిసిరి,ఉపాధ్యాయులు రవీందర్, వేణుగోపాల్, సాయిలు తదితరులు ఉన్నారు.

## ఘనంగా వన మహోత్సవం



**తూప్రాన్, జూలై 31(జనంసాక్షి):** మండలంలోని పరికిబండ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం సర్పంచ్ మోతిబాయి లక్ష్మణ్ సింగ్ ముఖ్య అతిధిగా పాల్గొని ఉప సర్పంచ్ మహేష్ యాదవ్, పంచాయతి కార్యదర్శి నాగరాజు గౌడ్ లతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటడంతో పాటు సంరక్షణ ముఖ్యం అని అన్నారు. మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్తులో మానవ మనుగడ ఆధారపడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

### హోతికె తెలంగాణ రెసిడెన్షియల్

## పాఠశాలలో ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ





**జహీరాబాద్, జూలై 31(జనంసాక్షి):** జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని హోతికె గ్రామంలో ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలను జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, తహసీల్దార్ దశరథ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటశాల, ఆహార నిల్వ గది, బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి వాటి నాణ్యత, పరిశుభ్రతపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంతో పాటు పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలను కూడా పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. పౌర హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

## ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ తప్పనిసరి



**రాయకోడ, జూలై 31 (జనంసాక్షి):** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు, పదవి విరమణ తప్పనిసరినని అయినప్పటికీ వారు విధి నిర్వహణలో అందించిన మంచి సేవలే చిరకాలం గుర్తుండి పోతాయని రైకోడ్ వీరభద్రేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్ సతీష్ కులకర్ణి, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు బసవరాజ్ పటేల్‌లు స్పష్టం చేశారు. మండల పరిధిలోని సంగీతం గ్రామంలో పశువైద్య శాఖలో పనిచేస్తున్న విఎల్‌వో హేమలతకు రాయికోడు పాండు రంగ మందిరంలో శుక్రవారం పదవి విరమణ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పశువైద్యాధికారి డాక్టర్ పాండ్యన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ హేమలత తన విధి నిర్వహణలో మంచి సేవలు అందించారని గుర్తు చేశారు. హేమలత మంచి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆ భగవంతున్నీ వేడుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పాండియన్ తోపాటు నాయకులు జీ శివకుమార్, విట్టల్ రావు కులకర్ణి, పీజీ మల్లప్ప, నాగేందర్ పాటిల్, పలువురు పైశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిలోనే విద్యార్థుల నడక.. ఫైజాబాద్ జెడ్పీహెచ్ఎస్‌లో దయనీయ పరిస్థితి

- డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విద్యార్థుల విజ్ఞప్తి





**చిలప్‌చేడ్, జూలై 31 (జనంసాక్షి):** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిలప్‌చేడ్ మండలంలోని ఫైజాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ పూర్తిగా నీటితో నిండిపోవడంతో విద్యార్థుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. బురద, నిల్వ నీటి కారణంగా పాఠశాలలోకి వెళ్లేందుకు విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అజ్జమర్రి, బండాపోతుగల్, ఫైజాబాద్ గ్రామాల నుంచి ప్రతిరోజూ ఈ పాఠశాలకు విద్యార్థులు వస్తున్నారు. నిర్మాణ్ సంస్థ సహకారంతో పాఠశాల అభివృద్ధి చెందినప్పటికీ, వర్షాకాలంలో వెనుక భాగంలో బురద అధికంగా పేరుకుపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగిన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వెనుక భాగంలో సీసీ రోడ్డు నిర్మించి విద్యార్థుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు, విద్యార్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# మానవ అక్రమ రవాణాపై విద్యార్థుల్లో చైతన్యం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహణ



**కల్వకుర్తి,జూలై 31,(జనంసాక్షి):** ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కల్వకుర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శార్వాణి ఆధ్వర్యంలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు మానవ అక్రమ రవాణా ప్రమాదాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. సఖి జిల్లా కోఆర్డినేటర్ పి. సునీత, డి.హెచ్.ఈ.డబ్ల్యూ. ఆఫీసర్ బి. సునీత, భరోసా సపోర్టు పర్సన్ దేవి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మానవ అక్రమ రవాణా ఆందోళనకర స్థాయిలో పెరుగుతోందన్నారు. ఉద్యోగాలు, అధిక వేతనాలు, విదేశీ అవకాశాలు, డబ్బు ఆశ చూపించి అమాయకులను మోసగిస్తున్నారని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, కదలికలపై వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే మానవ అక్రమ రవాణాను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి. చంద్రశేఖర్ గౌడ్, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ బారోతు రాజు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పగటిపూట దొంగతనానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్

- **15 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు నగదు స్వాధీనం**

**తూప్రాన్, జులై 31(జనంసాక్షి):** పగటిపూట దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ డిఎస్పి నరేందర్ గౌడ్ తెలిపారు విలేకరుల సమావేశంలో ఆయన వివరిస్తూ శివంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో బబ్బూరి శ్రీశైలం ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఎనిమిది తులాల బంగారు వస్తువులు కిలో వెండి వస్తువులను నగదును దొంగిలించి పరారయ్యారు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ మధుకర్ రెడ్డి దొంగతనం కేసును శివంపేట పోలీసులు ఛేదించి, నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు
పగటి సమయంలో పిల్లుట్ల గ్రామానికి చెందిన బబ్బూరి శ్రీశైలం ఇంట్లో ఎవరు లేని సమయం చూసి, గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తలుపుల తాళాలు తీసి లోపలికి ప్రవేశించారు. రూముల్లో ఉన్న బీరువాలను పగులగొట్టి, అందులో ఉన్న సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు, 99 తులాల వెండి వస్తువులు మరియు కొంత నగదును దొంగిలించి పరారయ్యారు. బాధితుడు బబ్బూరి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివంపేట సబ్ ఇన్స్పెక్టర్ (SI) గారు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా, గతంలో నేర చరిత్ర ఉన్న అనుమానితులపై నిఘా ఉంచిన పోలీసులు పిల్లుట్ల గ్రామానికి చెందిన బబ్బూ రి గోపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నిందితుడు మద్యం, జల్సాలకు అలవాటుపడి డబ్బులు సరిపోక సులభంగా డబ్బు సంపాదించడం కోసం ఈ దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నట్టు తెలిపాడు. శ్రీశైలం ఇంటికి తాళం వేసి ఉండటాన్ని గమనించి, పగటిపూట లోపలికి చొరబడి దొంగతనం చేసినట్లు అంగీకరించాడనీ తెలిపారు.



8 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, సెల్ ఫోను 2500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును వేగవంతంగా ఛేదించి స్వాధీనం చేసుకున్న చేసుకున్న తూప్రాన్ సిఐ వెంకట్రాజ గౌడ్, శివంపేట్ ఎస్ఐ మధుకర్ రెడ్డి సిబ్బంది గోవర్ధన్, వెంకట్, కృష్ణ, మహేందర్, శేఖర్ గట్టేష్‌లను తూప్రాన్ డిఎస్పి అభినందించారు. నిందితుడిని రిమాండ్ పంపినట్లు చెప్పారు. విలేకరుల సమావేశంలో సిఐ వెంకట్ రాజు గౌడ్ సీఎం మధుకర్ రెడ్డిలు పాల్గొన్నారు.

## హుసెల్కిలో.."సర్ సమగ్ర సవరణ" శతశాతం పూర్తి



**న్యాల్‌కల్, జూలై 31(జనంసాక్షి):** భవిష్యత్తు తరానికి ఎంతో కీలకం కానున్న ఓటర్ల "ప్రత్యేక సమగ్ర సవరణ" (సర్), 2026 ఓటర్ జాబితా ప్రక్షాళన మండలంలో చురుగ్గా కొనసాగుతోంది. మండల తహసిల్దార్, ఎంపీడీవో, ఉప తహసిల్దార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్, గ్రామ సర్ ప్రత్యేకాధికారి ప్రకాష్, జిపిఓలు, బిఎల్ఓలు, అంగన్వాడీల పర్యవేక్షణలో సర్ ప్రక్షాళన చురుగ్గా కొనసాగుతోంది. కర్ణాటక సరిహద్దు గ్రామం, మండలంలోని హుసెల్కి గ్రామంలో ఈ నెల 31, శుక్రవారం నాటికి ఓటరు జాబితా సర్ ప్రక్షాళన కార్యక్రమాన్ని శత శాతం పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ ఏ.రేవంత్ కుమార్, జిపిఓ పీరప్ప, బిఎల్ఓ గాళయ్య స్వామిలు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో 712 ఓటర్లకు గాను 635 ఓటర్లను అంతర్జాలంలో నమోదు చేయడం జరిగిందని, వివిధ కారణాలతో 69 ఓట్లను జాబితా నుండి తొలగించినట్లు బిఎల్ఓ తెలిపారు.

## ఔరంగానగర్‌లో పౌర హక్కుల దినోత్సవం

**జహీరాబాద్, జూలై 31 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలోని ఔరంగానగర్ గ్రామంలో శుక్రవారం పౌర హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిరాగ్‌పల్లి ఎస్సై కె.వినయ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు, సాంఘిక సంక్షేమ శాఖ ప్రత్యేక అధికారి, హాస్టల్ వార్డెన్ బాలరాజ్ పాల్గొని గ్రామస్థులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, చట్టం ముందు అందరూ సమానులేనని వివరించారు. మతం, కులం, వర్గం అనే తేడాలు లేకుండా పరస్పర గౌరవం, సోదరభావంతో జీవించాలని సూచించారు. పౌర హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.
వర్షాకాలంలో ప్రబలుతున్న సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, మరిగించిన లేదా శుభ్రమైన తాగునీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు



జ్వరం లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు, తుఫాను పరిస్థితుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం లేని ప్రయాణాలను నివారించాలని సూచించారు. విద్యుత్ తీగలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని, అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ



**నర్సాపూర్, జూలై 31 (జనంసాక్షి):** వనమహోత్సవం సందర్భంగా శుక్రవారం నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలకు మొక్కల పెంపకం ప్రాధాన్యతను వివరించి, ప్రతి ఒక్కరూ వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరుడి తుల్లమ్మ-బిక్షపతి, గ్రామ కార్యదర్శి శ్రావణి, ఆశావర్కర్ రాణి, పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెండికోల్ అంగన్వాడి ఆకస్మిక తనిఖీ

**చౌటకూర్, జూలై 31 (జనంసాక్షి):** మండలంలోని వెండికోల్ గ్రామ అంగన్వాడి కేంద్రాన్ని తహసీల్దార్ కిష్టయ్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం, పరిశుభ్రత, హాజరు నమోదు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పరిశీలించారు.



చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న సేవలు నిబంధనల ప్రకారం అందేలా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. కేంద్రంలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు సరి చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు చేస్తూ లబ్ధిదారులకు నాణ్యమైన సేవలు అందించాలని తహసీల్దార్ సూచించారు.

## బ్యాంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై నవీద్

**కృష్ణ, జూలై 31(జనంసాక్షి):** ఖాతాదారులు నగదు లావాదేవీల సమయంలో బ్యాంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలని కృష్ణ ఎస్సై ఏం ఏ నవీద్ సూచించారు. ప్రజల భద్రతే లక్ష్యంగా కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ బ్యాంకును కృష్ణ ఎస్సై ఎస్.ఎం. నవీద్ శుక్రవారం పరిశీలించారు. బ్యాంకులో అమలులో ఉన్న భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల



పనితీరు, సెక్యూరిటీ విధులు, నగదు లావాదేవీల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి బ్యాంకు అధికారులకు పలు సూచనలు చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే చోరీలు, మోసాలు, సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఎస్సై పేర్కొన్నారు. పోలీస్ శాఖ ప్రజల భద్రత కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎసై నవిద్ తెలిపారు.

## బీజేపీ మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

- **పార్టీ బలోపేతానికి నాయకులు సమష్టిగా కృషి చేయాలి**
- **జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్**

**మెదక్ టౌన్, జూలై 31 (జనంసాక్షి):** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మెదక్ జిల్లా మైనారిటీ మోర్చా నూతన జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు గ్యన్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు పార్టీ కండువాలు కప్పి, అధికారికంగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మైనారిటీ మోర్చా నాయకులు క్రియాశీలకంగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.
**నూతన కార్యవర్గం:** జిల్లా అధ్యక్షుడు: గ్యన్ సింగ్
**జిల్లా ప్రధాన కార్యదర్శులు:** నిరుడి లాజర్, సయ్యద్ గౌస్ పాషా



**ఉపాధ్యక్షులు:** కరమ్ సింగ్, షేక్ మొహమ్మద్, ఎండీ ఖలీల్
**కార్యదర్శులు:** ఎండీ నవబొద్దీన్, అజయ్ సింగ్
**కోశాధికారి:** పర్వేజ్
**జిల్లా కార్యవర్గ సభ్యులు:** సర్వన్ సింగ్, అమర్ సింగ్
ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈర్ల రంజిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వడ్ల జనార్ధన్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, పాపన్నపేట మండల అధ్యక్షుడు సంతోష్ చారి, జిల్లా నాయకులు లోకేష్, మధు, రాజు, శ్రీనివాస్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం వాసవి మాతకు వేడుకోలు

**వడ్డేపల్లి, జూలై 31 (జనంసాక్షి):** వడ్డేపల్లి పంటలకు అనుకూలమైన వర్షాలు కురిసి పచ్చని పైర్లు పల్లెల్లో కనిపించాలని రైతులు తమ పంటలను అధిక దిగుబడింది సాధించాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని సంప్రదాయ పద్ధతిలో విశేష పూజలు నిర్వహించారు ఆషాడమాసం అమ్మవారికి పుట్టింటి చీర సారా పెట్టాలని అందరికీ సౌభాగ్యం కలుగుతుందని గోరింటాకులతో పూజలు చేయాలని ఆలయ కమిటీ వారు ఈ సందర్భంగా మహిళలకు సూచించారు పూజా కార్యక్రమంలో భాగంగా తెల్లవారుజామున అమ్మవారికి సుప్రభాత సేవ, కుంకుమార్చన పంచామృతాభిషేకం, అమ్మవారికి విశేష అలంకరణ అనంతరం పుష్పార్చన



కార్యక్రమాలు నిర్వహించారు మధ్యాహ్నం మహా మంగళహారతి నిర్వహించి ప్రసాద వితరణ చేసిన అనంతరం సాయంత్రం పల్లకి సేవ చేసి గ్రామస్తుల తరపున రైతుల పక్షాన మొక్కుల చెల్లింపులో భాగముగా గోరింటాకు పూజ నిర్వహించారు సకాలంలో వర్షాలు కురిసి పంటలు సుభిక్షంగా పండాలని ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహిళా మండలి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు

## దుర్గమ్మ కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే



**అమీన్పూర్, జూలై 31(జనంసాక్షి):** ప్రతిఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట లో ఉన్న శ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో శుక్రవారం కళ్యాణ మహోత్సవం, బోనాల కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొనీ. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, దర్శన్, కుమ్మరి శాలివాహన సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కేజీవీల్స్‌తో రోడ్లపై ట్రాక్టర్లు నడిపితే జరిమానా విధించి సీజ్ చేయాలి



**మక్తల్, జూలై 31 (జనంసాక్షి):** రోడ్లపై ట్రాక్టర్లు కేజీ వీల్స్ తో తిరిగితే పోలీసులు జరిమానా విధించి సీజ్ చేయాలని సామాజిక కార్యకర్త బిజ్వార్ మహేష్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి రోడ్లు వేయిస్తుంటే కొందరు ట్రాక్టర్ల యజమానులు,డ్రైవర్లు నిర్లక్ష్యంగా కేజీవీల్స్‌ను ఉపయోగించి ట్రాక్టర్లను బిటి రహదారులపై నడిపిస్తూ రోడ్లను ధ్వంసం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి ట్రాక్టర్లు నడిపించే వారిపై మొదటిసారి రూ.5 వేలు, రెండవసారి రూ.10 వేలు జరిమానాలను విధించాలని అప్పటికి వినకపోతే ట్రాక్టర్లను సీజ్ చేసి రహదారులను కాపాడాలని మహేష్ గౌడ్ డిమాండ్ చేశారు.

## తోటపల్లిలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

- గ్రామాభివృద్ధి పనులకు శ్రీకారం
- రహదారుల విస్తరణ,వార్డు దారి ఏర్పాటు ప్రారంభం



**బెజ్జంకి, జూలై 31,(జనంసాక్షి):** మండలంలోని తోటపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కవ్వంపల్లి అశ్వినీశ్రీనివాస్ ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌర హక్కుల పరిరక్షణ,సమానత్వం,సామాజిక న్యాయం,భారత రాజ్యాంగ విలువల ప్రాముఖ్యతపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రతి పౌరుడు తన హక్కులతో పాటు విధులను కూడా గుర్తించి సమాజ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా రహదారులకు ఇరువైపులా పెరిగిన చెట్లు, ముళ్లపొదలను జేసీబీ యంత్రాల సహాయంతో తొలగింపు పనులు చేపట్టారు. అనంతరం గ్రామంలోని 1వ వార్డుకు దారి ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టారు.గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ కవ్వంపల్లి అశ్వినిశ్రీనివాస్ తెలిపారు.అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నాంపల్లి శంకర్,వార్డు సభ్యులు బుర్ర మహేందర్,ఎన్న వజ్రమ్మ నర్సయ్య,రెవెన్యూ అధికారులు సుహాసిని,రజిత,పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్,మహిళా సంఘాల ప్రతినిధులు స్వప్న,మహాలక్ష్మి,లలిత,గ్రామ యువకులు నవీన్,అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముంబై-హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్మీదుగా ఏర్పాటు చేయాలి



**జహీరాబాద్, జులై 31(జనంసాక్షి):** ముంబై - హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా అలైన్‌మెంట్ చేయాలని ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ ఈ నెల 11 తేదీన కేంద్ర రైల్వే, సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందించిన విషయం విదితమే.ఎమ్మెల్సీ డా. అంజిరెడ్డి అందించిన విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సానుకూలంగా స్పందిస్తూ అధికారికంగా ప్రత్యుత్తరం పంపారు. ముంబై - హైదరాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్‌ను జహీరాబాద్ మీదుగా మార్గం మార్చాలని కోరుతూ పంపిన అభ్యర్థనను పరిశీలన నిమిత్తం స్వీకరించినట్లు, తదుపరి అవసరమైన చర్యలు పరిశీలన అనంతరం తీసుకోబడతాయని కేంద్ర మంత్రి ఇటీవల తన లేఖలో స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి సానుకూల స్పందన పట్ల ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి హర్షం వ్యక్తం చేసారు.జహీరాబాద్ ప్రాంత పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధికి, ప్రయాణికుల సౌలభ్యానికి ముంబై-హైదరాబాద్ బుల్లెట్ రైలు మార్గం జహీరాబాద్ మీదుగా వెళ్లడం అత్యంత కీలకమని, దీనిపై కేంద్ర మంత్రి స్పందించి పరిశీలనకు ఆదేశించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ జహీరాబాద్ మీదుగా సాకారమైతే ఈ ప్రాంతంలో రవాణా మరియు లాజిస్టిక్స్ సౌకర్యాలు అద్భుతంగా మెరుగవడమే కాకుండా, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మరింత బలపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రోగుల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి

- **మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి వినతిపత్రం ఇచ్చిన బీజేపీ నాయకులు**



**మక్తల్, జూలై 31 (జనంసాక్షి):** మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, వారి సహాయకులు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిని వెంటనే నివారించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మక్తల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రి సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ?ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డెలివరీ వార్డులో ఉన్న తల్లులు, రాత్రి వేళల్లో అడ్మిట్ అయ్యే రోగులు నీటి కోసం అల్లాడుతున్నారని తెలిపారు. సమయానికి మందులు వేసుకోవడానికి కూడా నీరు లేక బయటి షాపుల్లో వాటర్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని, కొందరు రాత్రిపూట బంధువులు, స్నేహితుల ఇళ్ల నుంచి తెప్పించుకుంటున్నారని ఆస్పత్రి వర్గాల దృష్టికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలోని ఆర్ఓ వాటర్ ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలని, ఒకవేళ అది పనిచేయని స్థితిలో ఉంటే నూతన వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి 24 గంటలు తాగునీరు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

?దీనిపై ఆస్పత్రి సిబ్బంది సానుకూలంగా స్పందిస్తూ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, ఆర్ఓ ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేయించి రోగులకు నీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ?ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మహేష్ సాగర్, కుర్వ లింగం, శ్రీకాంత్, రాజా గౌడ్, బ్యాటరీ రాజు, మంజునాథ్, నవీన్, రమేష్, ఆంజనేయులు, భీమేష్, పాపిరెడ్డి, గోవింద్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల జీవితాలతో ఆడుకోవద్దు

- **టియుటిఐసు జిల్లా ఉపాధ్యక్షులు కె.కాశీనాథ్**



**నారాయణపేట, జూలై 31(జనంసాక్షి):** ఆటో డ్రైవర్ల జీవితాల తో చెలగాటం ఆడొద్దని నారాయణపేట జిల్లా టిఐటియుసి అధ్యక్షుడు కే.కాశినాథ్ ఒక ప్రకటనలో కోరారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్టీసీ సంస్థ ద్వారా ఆటోలను నడిపిస్తా మని, బస్సు టికెట్ బుక్ చేసినప్పుడే ఆటో టికెట్ కూడా బుక్ చేసుకోవచ్చని ప్రకటించడం జరిగిందన్నారు. ఇది ఆటో కార్మికుల పొట్టకొట్టే చర్య, ఇప్పటికే మహిళలకు ఫ్రీ బస్సు పెట్టి నప్పటి నుండి మహిళా ప్రయాణికులు ఆటోలలో ప్రయాణించడం తగ్గింద న్నారు. దీంతో తీవ్రమైన ఆర్థిక భారంతో ఆటో కార్మికులు తమ జీవితాల ను వెలదీస్తున్నారన్నారు. ఆటో కార్మికులకు 12 వేల ఆర్థిక సహాయం చేస్తామని ఎన్నికల హామీలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన అది ఇప్పటికీ అమలు కాలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిల బెట్టుకోవాలనీ డిమాండ్ చేశారు.ఆటో కార్మికులకు ఆర్థిక సహాయం చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ సంస్థతో ఎలక్ట్రికల్ వెహికల్ సంస్థ దగ్గర తీసుకునేటటు వంటి ఒప్పందం రద్దు చేసు కోవాలనీ కోరారు. ఇప్పటికే ఆటోలు నడిపిస్తున్నటువంటి ఆటోడ్రైవర్లకే ఆ అవకాశం కల్పించాలనీ.ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కింద రాష్ట్ర ప్రభు త్వం ఉపాధి చూయించా లన్నారు. ఏ సంస్థలకు కాంట్రాక్టు అప్పగించకుండా ఆటో డ్రైవర్లని భాగస్వాములు చేసి ఉపాధి కల్పించాలన్నారు. రోడ్డు మీద ఆటోలు నడుపుతున్న ప్రతి ఆటో కార్మికునికి రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రికల్ వెహికల్ ఆటోలను మంజూరు చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో ఆటో కార్మికుల్ని భాగస్వా ములు చేయాలని డిమాండ్ చేశారు.

## మంబోజిపల్లి పల్లె చెరువుకు నిలిచిన వరద నీరు ప్రవాహం

- కాల్వలో ప్రహరీ కూలడమే కారణం!
- గామస్తులు ఆరోపణ



**మెదక్ రూరల్, జూలై 31 (జనంసాక్షి):** మెదక్ మండలంలోని మంభోజిపల్లి గ్రామంలోని పల్లె చెరువుకు నిలిచిన వరద నీళ్లుకాల్వలో ప్రహరీ గోడ కులాడమే కారణమాని గ్రామస్తులు మీడియాతో ఆరోపించారు. మెదక్ మండల పరిధిలోని ఘనపూర్ ఆయకట్టు ద్వారా వచ్చే నీరు మాచవరం గ్రామం నుంచి మంబోజిపల్లి పల్లె చెరువులోకి వచ్చే నీటి కాల్వలో ప్రహరీ గోడ కూలిపోవడంతో నీటి ప్రవాహం పూర్తిగా నిలిచిపోయింది. దీంతో చెరువుకు నీరు చేరక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మాచవరం గ్రామానికి చెందిన సూర్యకాంత్ (ఇంటి నెం. 1-1-20) నివాసం వద్ద ఉన్న ప్రహరీ గోడ కాల్వలో కూలిపోవడంతో పాటు కాల్వలో పేరుకుపోయిన మట్టిని తొలగించకపోవడంతో నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యపై మంబోజిపల్లి గ్రామ సర్పంచ్ మానస రాములు, ఉపసర్పంచ్ మహేష్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఇరిగేషన్ అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చెరువులోకి నీరు రాకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కాల్వలోని మట్టిని తొలగించి, కూలిపోయిన ప్రహరీ కారణంగా ఏర్పడిన అడ్డంకులను తొలగించి చెరువులోకి నీరు సక్రమంగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

## సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

- వైద్య అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు



**మక్తల్, జూలై 31 (జనంసాక్షి):** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ వ్యాప్తంగా దోమల నివారణ, సీజనల్ వ్యాధుల అరికట్టడమే లక్ష్యంగా చేపడుతున్న ప్రతీ శుక్రవారం 'డ్రై డే ఫ్రైడే' కార్యక్రమంలో భాగంగా స్థానిక 12వ వార్డులో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని వార్డు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాత టైర్లు, పూల తొట్లు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వారంలో ఒకరోజు 'డ్రై డే'గా పాటించి నీటి పాత్రలను శుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీచందన, డాక్టర్ జాంరాజ్, 12వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ రహీమ్ పటేల్, కో-ఆప్షన్ సభ్యుడు హుసామోద్దీన్, వార్డు ఆఫీసర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధురాలి హత్య కేసులో దంపతులకు జీవిత ఖైదు

• ఒక్కొక్కరికి రూ.7 వేల జరిమానా.. కేసు దర్యాప్తు చేసిన పోలీసులను అభినందించిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



మెదక్ బ్యూరో, జూలై 31 (జనంసాక్షి): వృద్ధురాలిని హత్య చేసి నగదు దోచుకున్న కేసులో నిందితులైన దంపతులు లిలిబి. కిరాజీ (36), జక్కుల చంద్రకళ (34)లిలిలకు మెదక్ జిల్లా ప్రధాన న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున మొత్తం రూ.14 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వెల్లడించిన వివరాల ప్రకారం.. కిరాజీ, చంద్రకళ సహజీవనం చేస్తూ జీవనం సాగించేవారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా చంద్రకళ తల్లి రాధ వద్ద ఉన్న నగదును దోచుకునేందుకు ఆమెను హత్య చేయాలని పథకం రచించారు. 2020 అక్టోబర్ 11న రాధకు మద్యం తాగించి, కిరాజీ నడుపుతున్న ఆటోలో తీసుకెళ్లారు. కిరాజీకి పరిచయమున్న లక్ష్మీ, సలీంలను కూడా వెంట తీసుకుని ఉప్పుగూడ నుంచి బోయిన్‌పల్లి మీదుగా మనోహరాబాద్ వైపు వెళ్లి, జాతీయ రహదారి సమీపంలో ఆటోను నిలిపి రాధను నిర్జన ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. హత్య అనంతరం హైదరాబాద్‌లోని ఉప్పుగూడలో ఉన్న రాధ ఇంటికి వెళ్లి ఆమె దాచిన రూ.4 లక్షల నగదును నిందితులు అపహరించినట్లు పోలీసులు గుర్తించారు. ఆ మొత్తంలో రూ.50 వేలును లక్ష్మీ, సలీంలకు ఇచ్చినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హత్యకు ఉపయోగించిన కత్తిని ఇంట్లో దాచిపెట్టినట్లు, అనంతరం దోచుకున్న నగదుతో కొంత బంగారం, వెండి వస్తువులు కొనుగోలు చేసి గుజరాత్‌కు వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈ కేసులో మనోహరాబాద్ పోలీసులు కేసు నమోదు చేయగా, అప్పటి దర్యాప్తు అధికారులు స్వామిగౌడ్, శ్రీధర్ సమగ్ర విచారణ నిర్వహించి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి. వెంకటేశ్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. నీలిమ నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ.7 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసులో సమర్థవంతమైన దర్యాప్తు, ప్రాసిక్యూషన్ సమన్వయంతో న్యాయం జరిగేలా కృషి చేసిన జిల్లా లైజనింగ్ ఆఫీసర్ ఎస్ఐ బి. విఠల్, కోర్టు లైజనింగ్ పీసీ జి. రవీందర్‌గౌడ్, సీడీఓ మహిపాల్‌రెడ్డి తదితర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి

• అప్పుడే సత్వర న్యాయం.. తహాశీల్దార్ శ్రీనివాస్



కృష్ణ, జూలై 31 (జనంసాక్షి): చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అప్పుడే సత్వర న్యాయం దక్కుతుందని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు.ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తామని తాసిల్దార్ శ్రీనివాస్, తెలిపారు. చేగుంట గ్రామంలో సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. కొన్ని సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు , ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్‌శాఖ గ్రామాలలో రెవెన్యూశాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి రవి కుమార, సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, సర్పంచ్ విద్యాధారి, జిపిఓ ర్వేంకటయ్య, వార్డ్ మెంబర్ వడ్ల మారెప్ప, జి లక్ష్మణ్,తిప్పణ్, బ్రహ్మయ్య, పోలీసులు,యాదగిరి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నేడు పాఠశాల అదనపు గదులు ప్రారంభం



మల్దకల్, జూలై 31 (జనంసాక్షి): మండల కేంద్రంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాఠశాలలో శనివారము ఉదయం 9.00 గంటలకు, పీఎం శ్రీ,ఏడబ్ల్యు పిఅండ్ బి నిధులతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ముఖ్యఅతిథి హాజరై ప్రారంభిస్తారు.జోగులాంబ గద్వాల జిల్లా విద్యాశాఖ అధికారివిజయలక్ష్మి, సర్పంచ్ చిట్టెమ్మ, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు,గ్రామ యువత,విద్యా కమిటీ సభ్యులు హాజరవుతారు. ఎన్నో రోజుల నుండి ఎదురుచూస్తున్న అదనపు గదులు నిర్మాణం పనులు పూర్తి కావడంతో ఎటకేలకు ప్రారంభం చేయడానికి సిద్ధం చేశారు.

## 1.30 కోట్లతో కల్వకుర్తి మినీ స్టేడియం అభివృద్ధి

• ఆగస్టు 3న పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన
• 400 మీటర్ల ట్రాక్‌తో పాటు ఆధునిక వసతుల కల్పన



కల్వకుర్తి,జూలై 31,(జనంసాక్షి): కల్వకుర్తి మినీ స్టేడియం త్వరలో ఆధునిక సౌకర్యాలతో కొత్త రూపు సంతరించుకోనుంది. స్టేడియం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ తెలిపారు. శుక్రవారం జిల్లా క్రీడలు, యువజన శాఖ అధికారి సీతారాం నాయక్‌తో కలిసి మినీ స్టేడియాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు షేక్ ఏజాస్, కొల్లోజు రాజేష్ కుమార్, పుస్తకాల రాహుల్, ఏఈ సంతోష్ కుమార్, ఫుట్‌బాల్ శిక్షకుడు వెంకటరాములు, గుత్తేదారు ప్రవీణ్ కుమార్, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు సుధాకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్‌కు అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీని వెంటనే నియమించాలి

• డీఐఈఓకు తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ వినతి




మెదక్ బ్యూరో, జూలై 31 (జనంసాక్షి): మెదక్ జిల్లాకు అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా సెక్రటరీని తక్షణమే నియమించాలని తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఐఈఓ)కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్ర పునర్విభజన అనంతరం సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల్లో అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీలను నియమించి క్రీడా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ, మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు సెక్రటరీని నియమించకపోవడం వల్ల క్రీడా కార్యకలాపాల నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్ఐ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రభుత్వ ఫిజికల్ డైరెక్టర్ లేదా ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిని మెదక్ జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ జిల్లా సెక్రటరీగా వెంటనే నియమించాలని కోరారు. విద్యార్థుల క్రీడా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ అంశంపై జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, జిల్లా కార్యదర్శి మధు, రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ కృష్ణ, గజేంద్రులు, నర్సింలు, బసవరాజ్, కృష్ణ, శోభ, శృతి, గీతతో పాటు పలువురు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వర్గం లేదు... పోరు లేదు..!

• పార్టీ విభేదాలు అస్సలేవ్.!
• కుట్రలు చేస్తే అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం..!
• ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, పార్టీ అధ్యక్షులు మల్లన్న పాటిల్



కోహిర్, జూలై 31(జనంసాక్షి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో వర్గ పోరు, పార్టీలో విభేదాలున్నాయని, న్యూస్ పేపర్ లో వచ్చిన కథనానికి ఏలాంటి విభేదాలు లేవని ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్ లు అన్నారు. శుక్రవారం కవెల్లి చౌరస్తా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో ఎటువంటి వర్గాపోరు లేదని, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం మేరకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడ పార్టీ ఆదేశాల మేరకే నాయకులు కార్యకర్తలు పని చేస్తున్నామని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సారథ్యంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని హామిచ్చారు. రాబోయే ఏ ఎన్నికైన మండలంలో కలిసి కట్టుగా ఎదుర్కొని పార్టీ విజయానికి కృషి చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కోహిర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజఫర్, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9, 10 తేదీల్లో నర్సాపూర్‌లో బోనాల ఉత్సవాలు



నర్సాపూర్, జూలై 31 (జనంసాక్షి): ఆషాఢమాసం బోనాల పండుగను పురస్కరించుకొని నర్సాపూర్ పట్టణంలో ఆగస్టు 9, 10 తేదీల్లో రెండు రోజుల పాటు బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, బోనం సమర్పణ, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ రెండు రోజుల వేడుకల్లో పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## ఎల్లుపేట ప్రధానోపాధ్యాయుడిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి

• నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యంపై డీఈఓకు ఎస్‌టీయూ వినతి

మెదక్ బ్యూరో, జూలై 31 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం మండలం ఎల్లుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావుపై నిధుల దుర్వినియోగం, విధుల పట్ల నిర్లక్ష్యానికి సంబంధించి సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) మెదక్ జిల్లా శాఖ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ సంతకం లేకుండానే కాంప్లెక్స్ నిధులను డ్రా చేసి దుర్వినియోగం చేశారని ఆరోపించారు. అలాగే టీడీఎస్ పేరిట కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.200 చొప్పున వసూలు చేశారని పేర్కొన్నారు. అంతేకాకుండా, జూలై 20 నుంచి 25 వరకు ప్రధానోపాధ్యాయుడు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, పాఠశాల ఇన్‌చార్జి బాధ్యతలను ఎవరికీ అప్పగించకుండా విధులకు దూరంగా ఉన్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరారు. ఈ మేరకు ఎస్‌టీయూ జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు.

## తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు



**మల్దకల్, జులై 31(జనంసాక్షి):** సీడ్ దోసకాయ అతి తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందవచ్చు. రైతు సోదరులకు ముందుగా అడ్వాన్స్ పెట్టుబడి సీడ్ విత్తనాలు, అడుగు మందులు పెస్టిసైడ్స్ పురుగుల మందులు కంపెనీ పెట్టుబడిగా పెట్టి రైతులు పండించిన పంటను అగ్రిమెంట్ రేటు ప్రకారం కంపెనీ వారు చెల్లిస్తారు. రైతులు పండించిన దోసకాయలను ఎక్కడ బయట మార్కెట్లో అమ్మకూడదు కంపెనీ వాళ్ళే తీసుకొని వెళ్తారు. జిల్లాలోని వివిధ గ్రామాలలో దాదాపుగా 120 ఎకరాల లో పంటను పండించడం జరుగుతుంది.దోసకాయ పంట పెద్దొడ్డి,మల్దకల్ గ్రామాలలో రైతులు కంపెనీ సీడ్ విత్తనాలను అధిక మొత్తంలో వేసి మంచి దిగుబడిగా లాభాలు పొందుతున్నారు. గద్వాల బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్స్ కురువ గోపాలు మాట్లాడుతూ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.అతి తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాల వైపు వెళ్తున్న సీడ్ దోసకాయ సాగుఈ పంట వచ్చేసి రెండు నెలలు 60 రోజుల్లో పూర్తవుతుంది. సీడ్ మొక్క నాటిన రోజు నుంచి 30 రోజుల తర్వాత పంట కోతకు వస్తుంది. 31వ రోజు నుంచి 60 రోజుల వరకు మనకు క్రాప్ కాస్తనే ఉంటుంది. 60 రోజుల తర్వాత పంట మొత్తం క్లోజ్ అవుతుంది. మన కంపెనీ రేట్లు వచ్చేసి 30 + 18 రూపాయలు 30 - 04 రూపాయలు కంపెనీవారు అగ్రిమెంటు రేటు ప్రకారం రైతులకు చెల్లిస్తారు.

## విద్యార్థుల భవితకు ఈశ్వరయ్య కృషి

- **మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్**



**జడ్చర్ల, జూలై 31 (జనంసాక్షి):** పాఠశాల విద్యార్థుల పట్ల ఈశ్వరయ్య సార్ ఎంతో శ్రద్ధ కనబరిచారని, విద్యార్థులకు బోధన అందించే విషయంలో వారు ఎంతో కృషిచేశారని, వారి సేవలు విద్యార్థులకు ఎప్పటికీ స్ఫూర్తి దాయకమని మాజీ కౌన్సిలర్ చైతన్య చౌహాన్ పేర్కొన్నారు. 9వ వార్డు జయప్రకాష్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు రాజాగాని ఈశ్వరయ్య పదవి విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయురాలు చంద్రకళ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఈశ్వరయ్య ఉన్నతమైన సేవలను పలువురు స్మరించుకున్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కృష్ణ, టీపీయూఎస్ బాబునాయుడు, మధు, భాస్కర్, కృష్ణ, గోపాల్, పతి, కృష్ణ, వేణు, శేఖర్ తదితరులు పాల్గొని ఈశ్వరయ్య శుభాకాంక్షలు తెలియజేశారు.

## హైదరాబాద్-సిద్దిపేట-కరీంనగర్ రహదారిపై భద్రతా చర్యలు చేపట్టాలి

- **ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజనీర్‌కు బీఎస్పీ నేతల వినతి**



**సిద్ధిపేట, జూలై 31 (జనంసాక్షి):** హైదరాబాద్-సిదిపేట-కరీంనగర్ రాష్ట్ర రహదారి (స్టేట్ హైవే-1)పై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణ భద్రతా చర్యలు చేపట్టాలని బహుజన సమాజ పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు రోడ్లు, భవనాల శాఖ ఎమర్జింగ్ / లెఫ్ట్ వింగ్ ఎక్స్ట్రీమిజం, రైల్వే సేఫ్టీ వర్క్స్, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్, ఎక్స్టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్‌ల చీఫ్ ఇంజనీర్ వనజకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాము శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోడపట్ల ఈశ్వర్ ఆదేశాల మేరకు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి ఆధ్వర్యంలో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి మాట్లాడుతూ, హైదరాబాద్ నుంచి కరీంనగర్ వరకు సుమారు 80 కిలోమీటర్ల మేర ఉన్న ఈ రహదారి హెచ్‌కేఆర్ రోడ్‌వేస్ లిమిటెడ్ నిర్వహణలో ఉందని చెప్పారు ఈ కార్యక్రమంలో బీఎస్పీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ పంగ బాబు, సిద్ధిపేట జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేశ్, జిల్లా కోశాధికారి మైల తిరుపతి తదితర నాయకులు పాల్గొన్నారు.

## మెదక్ ప్రజలకు అందుబాటులో లేని మున్సిపల్ కమిషనర్ తీరును ఖండిస్తున్నాం




**మెదక్ టౌన్ జులై 31, (జనంసాక్షి):** ఈరోజు మెదక్ పట్టణంలోని తెలంగాణ రక్షణశేన (టీఆర్ఎస్ పార్టీ) కార్యాలయంలో మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బట్టి అజయ్ గారి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బట్టి అజయ్ మాట్లాడుతూ, తెలంగాణ మున్సిపాలిటీస్ చట్టం-2019 ప్రకారం మున్సిపల్ కమిషనర్ ఒక మున్సిపాలిటీకి ముఖ్య కార్యనిర్వాహక అధికారి (Chief Executive Officer) అని పేర్కొన్నారు. పట్టణంలో పారిశుధ్యం, డ్రైనేజీ, రోడ్లు, ప్రజారోగ్యం, మురుగునీటి నిర్వహణ, శ్మశాన వాటికలు, డంప్‌యార్డులు, వీధి దీపాలు, నీటి సరఫరా, ప్రజా భద్రతతో పాటు అన్ని మున్సిపల్ సేవలను సమర్థవంతంగా నిర్వహించడం కమిషనర్ చట్టబద్ధమైన బాధ్యత అని గుర్తు చేశారు. ప్రస్తుతం వర్షాకాలంలో మెదక్ పట్టణంలోని అనేక కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగునీరు ఇళ్లలోకి, వ్యాపార సముదాయాల్లోకి చేరుతున్నప్పటికీ, ప్రజలు ఫోన్ చేసినా, ప్రజాప్రతినిధులు సంప్రదించినా మున్సిపల్ కమిషనర్ స్పందించడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం అత్యంత విచారకరమని అన్నారు. రోడ్ల దుస్థితిపై వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లిన ప్రజలను, "మీరు ప్రాపర్టీ ట్యాక్స్ కట్టారా? వాటర్ ట్యాక్స్ కట్టారా?" అని ప్రశ్నించడం ప్రజలను అవమానించే చర్య అని విమర్శించారు. పన్నులు వసూలు చేయడం మున్సిపాలిటీ హక్కు అయినప్పటికీ, అభివృద్ధి పనులు చేయడం మున్సిపాలిటీ బాధ్యత అని స్పష్టం చేశారు. పన్నులు చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం మున్సిపాలిటీకి ఉన్నప్పటికీ, మొత్తం పట్టణానికి అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు వంటి ప్రాథమిక సేవలను నిర్లక్ష్యం చేయడానికి అది కారణం కాదని పేర్కొన్నారు. ప్రభుత్వం నుండి మెదక్ మున్సిపాలిటీకి భారీ మొత్తంలో అభివృద్ధి నిధులు మంజూరైన విషయాన్ని గుర్తు చేస్తూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో జి.ఓ.ఆర్.టి. నెం. 723 ద్వారా 29 అభివృద్ధి పనులకు రూ.18.70 కోట్ల పరిపాలనా అనుమతి లభించిందని తెలిపారు. ఇందులో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ ద్వారా రూ.15 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.3.70 కోట్లు మంజూరయ్యాయని చెప్పారు.

అలాగే జి.ఓ. నెం. 51 (Revised Clearance) ద్వారా తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (TUFIDC) ఆధ్వర్యంలో రూ.30.29 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సవరించిన అనుమతి లభించిందని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, డ్రైనేజీలు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్, సివరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, పార్కులు, కల్వర్టులు, ఫుట్‌పాత్‌లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, డంప్‌యార్డులు, శ్మశాన వాటికలు, కమ్యూనిటీ మౌలిక సదుపాయాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు వంటి పనులు చేపట్టవచ్చని వివరించారు.

టెండర్లు పూర్తై, వర్క్ ఆర్డర్లు జారీ అయినప్పటికీ కాంట్రాక్టర్లకు సరైన మార్గదర్శకాలు ఇవ్వడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ఫలితంగా అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

చివరగా, మెదక్ మున్సిపల్ కమిషనర్ వెంటనే ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉండాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ రక్షణశేన (టీఆర్ఎస్ పార్టీ) తరఫున బట్టి అజయ్ గారు ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని మరియు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ప్రజాస్వామ్యబద్ధమైన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. మీరు ప్రెస్ నోట్ చివర జోడించడానికి అనువైన పేరాగ్రాఫ్ ఇది. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణశేన (టీఆర్ఎస్ పార్టీ) సీనియర్ నాయకులు లిఇప్పా రమేష్ గారు,లి మెదక్ టౌన్ ఇన్‌చార్జ్ లికేవల్ నందకుమార్ గారు,లి లిభాను గారు, చౌదరి నవీర్ గారు, సయ్యద్ ఇమ్రోజ్ గారు,లి అలాగే తెలంగాణ రక్షణశేన (టీఆర్ఎస్ పార్టీ) అభిమానులు, కార్యకర్తలు, నాయకులు మరియు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొని, మెదక్ పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పార్టీ చేపడుతున్న ఉద్యమానికి తమ పూర్తి మద్దతు ప్రకటించారు.

## కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**కొడంగల్, జులై 31, (జనంసాక్షి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు చెక్కుల కార్యక్రమం శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమనికి కొడంగల్ నియోజకవర్గ ఇంచార్జీ ఎనుమల తిరుపతి రెడ్డి, కాడా ప్రత్యక అధికారి వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకం పేదింటి ఆడపడుచు తల్లిదండ్రులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధిచి 79 మంది లబ్ధిదారులకు రూ 79,09,164 విలువైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అమిన్ కుంట్ల గ్రామంలో 2, బలభద్రాయ పల్లి గ్రామంలో 14, భక్తిమళ్ల గ్రామంలో 6, బోగారం గ్రామంలో 2,గుండుమాల్ గ్రామంలో 28, కొమ్మూరు గ్రామంలో 18, ముదిరెడ్డి పల్లి గ్రామంలో 4, సారంగారావు పల్లి గ్రామంలో 1, వీరారం గ్రామంలో 4 కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి సమర్థవంతంగా చేరవేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం మోడల్ స్కూల్ విద్యార్థుల మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పోష్టికాహార భోజనం అందించాలని ఆదేశించారు. స్కూల్ లోని బాలిక, బాలురలకు వేరు వేరు బాత్ రూమ్‌లను ఏర్పాటు చేయలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్ లో విద్యార్థులతో చికెన్, పండ్లు, బాత్ రూమ్, నీళ, మెనూ ప్రకారం భోజనం పడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదిరోజుల్లో అని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భాస్కర్ స్వామి, ఎంపిడిఓ వేణుగోపాల్, నారాయణపేట జిల్లా డిసిసి ఉప అధ్యక్షులు ఎస్ సురేష్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి, ఎస్సీ సెల్ డిపార్టుమెంట్ చైర్మన్ వెంకటయ్య, గుండుమాల్ సర్పంచ్ శ్రీశైల నర్సింహ, మండల గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పేట కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**నారాయణపేట, జూలై 31(జనంసాక్షి):**
నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణపేట పట్టణానికి చెందిన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణానికి చెందిన మొత్తం 127 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ప్రజాప్రతినిధులు అందజేసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. అలాగే నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి గారు నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు చిట్టెం మాధవ్ రెడ్డి, నారాయణపేట మున్సిపల్ చైర్మన్ శ్వేతా సత్య యాదవ్,



వైస్ చైర్మన్ మంజుల జి.ఆర్. రెడ్డి,ఆర్ టి ఎ మెంబర్ పోషల్ రాజేష్, కౌన్సిలర్లు బండి రాజేశ్వరి, అరుణ మనోహర్ గౌడ్, కందెనపల్లి సత్యమ్మ, శ్వేత వెంకటేష్ గౌడ్, మహేష్, గొల్ల రవితేజ, రాజేష్ ఘూట్,మైనారిటీ నాయకులు సలీం మహమూద్, రహేమాన్ చంద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జిల్లాలో తొలి మహిళా సమైక్య భవనం ఖిల్లాలో ప్రారంభం చేసిన ఎమ్మెల్యే మేఘా రెడ్డి



**ఖిల్లా ఘనపురం, జులై 31(జనంసాక్షి):** రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయం అని స్థానిక మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన జిల్లా తొలి మహిళా సమైక్య భవనాన్ని స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి స్థానిక నాయకులు సంబంధిత అధికారుల కలసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభ్యున్నతి, సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు ,మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన పథకాలు అవకాశాలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో మహిళలకు పెద్దపీట అలాగే రేషన్ కార్డుల జారీ, మహిళలకు పెట్రోల్ బంకుల కేటాయింపు, మహిళల ఆధ్వర్యంలో క్యాంటీన్ల ఏర్పాటు చేస్తున్నాం అని విద్యార్థుల పాఠశాల యూనిఫాంల తయారీ మధ్యాహ్న భోజన నిర్వహణ అలాగే సోలార్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతలు. సమైక్య భవనాల ఉద్దేశ్యం అని గ్రామ, మండల, జిల్లా స్థాయిల వరకు మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భవనాలను నిర్మిస్తోంది. ఇవి మహిళల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, నైపుణ్యాభివృద్ధి స్వయం ఉపాధి కార్యకలాపాలకు వేదికలుగా ఉపయోగపడతాయి అని ఎమ్మెల్యే మేఘా రెడ్డి తెలిపారు. అనంతరం మండల సమైక్యలో యూనిఫామ్స్ కటింగ్ సిబ్బంది వారి పని గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆగారం పద్మమ్మ, మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు నవనీత, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరెడ్డి, సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామరాజు,ఏపీఎం.నాగరాజు, ఖాదర్, అగారం ప్రకాష్, మహిళా సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి: తాసిల్దార్ ఝాన్సీరాణి



**మల్దకల్, జులై 31(జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్.ఐ.ఆర్.కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని,జిల్లాలో ఇప్పటికే దాదాపు 90 శాతం పూర్తయిందని, మిగిలిన 10 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికారులు బీఎల్‌వోలురాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు బీఎల్ఏలు సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని తాసిల్దార్ ఝాన్సీరాణి తెలిపారు. శుక్రవారం తాసిల్దార్ కార్యాలయంలో బిఎల్వోలతో మాట్లాడుతూ ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుందని, ఇంకా మిగిలిన 10 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతాల్లో ఉండే అవకాశం ఉందని, తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని పేర్కొన్నారు. ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసాగించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిద ఓటర్ల జాబితాలో నమోదు కావని,వారు తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉంటుందన్నారు. అలాగే చనిపోయిన వాళ్లను వివాహం అయిన వాళ్లను గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకోవాలని తెలిపారు. అన్ని పత్రాలు జాగ్రత్తగా తప్పులు లేకుండా చూసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో మండలం మొదటి స్థానంలో రావడానికి బిఎల్వోలు ఎంతో కృషి చేశారని అలాగే ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకుని 100% పూర్తి చేయాలని ఆమె తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ మహేందర్, సీనియర్ అసిస్టెంట్ కరీం, బిఎల్వోలు పాల్గొన్నారు.

## శ్రీ బంగారు మైసమ్మకు ప్రత్యేక పూజలు



**జడ్చర్ల , జూలై 31 (జనంసాక్షి):** జడ్చర్ల పరిధిలోని కావేరమ్మపేట శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 44వ జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. పూజా కార్యక్రమాల్లో దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త గోనెల నరేందర్ మహేశ్వరి దంపతులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక భక్తులు, మహిళలు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డికి నివాళులు అర్పించిన బీఆర్ఎస్ నాయకులు



**జడ్చర్ల, జూలై 31(జనంసాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి శుక్రవారం జడ్చర్లలో బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య, పిట్టల మురళి, రఘుపతి రెడ్డి, ఇమ్ము సుదర్శన్, మాజీ కౌన్సిలర్ కొట్ల ప్రశాంత్ రెడ్డి, మహేష్, నరసింహ, కొండల్, కరాటే శ్రీను, గిరి యాదవ్, అమీర్, బీకేఆర్, శంకర్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అశ్రునివాళులు అర్పించారు.

## యోగ జీవితంలో భాగం చేసుకోవాలి

- డిఎంహెచ్ఓ డా. జయచంద్రమోహన్



**నారాయణపేట జూలై 31(జనంసాక్షి):** యోగా ప్రతి ఒక్కరి జీవనంలో భాగం కావాలని జిల్లా వైద్యాధికారి జయ చంద్రమోహన్ అన్నారు. నారాయణపేట జిల్లాలోని వ్యాయమ ఉపాధ్యాయుల కు నారాయణపేట మండ లం జాజపూర్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర విద్య శాఖ అధికారుల ఆదేశాల మేరకు మూడు రోజుల ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం మూడవ రోజు నారాయణపేట జిల్లా వైద్యాధికారి డా. జయ చంద్రమోహన్ హాజరై యోగ వల్ల లాభాల గురించి తెలపడం జరిగింది.నేటి తరంలో విద్యార్థులు తీసుకుంటున్న జంక్ ఫుడ్ ల వల్ల పిల్లాడు ఆటల్లో చురుకుదనం తగ్గింది అని విద్యార్థులు పౌష్టిక ఆహారం తీసుకోవడం వలన అన్ని రంగాల్లో చలాకీగా ఉంటా డు అని అన్నారు.

**పాఠశాల నిర్వహణలో వ్యాయమ ఉపాధ్యాయుల పాత్ర గొప్పది: జిల్లా విద్యాధికారి గోవింద రాజులు**

జాజపూర్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మూడు రోజుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరైన జిల్లా విద్యాధికారి గోవింద రాజులు హాజరై ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ వ్యాయమ ఉపాధ్యాయులు తమ విధులు సక్రమంగా నిర్వర్తిస్తున్నారని ఇంకా విద్యార్థులు జాతీయ అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొనే స్థాయికి ఎదిగేలా కృషి చేసి జిల్లాకు మంచిపేరు తీసుకొని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ జిల్లా వైద్యశాఖ ప్రోగ్రాం కో ఆర్డినేటర్,వ్యాయమ ఉపాధ్యాయుల తరగతులు నిర్వహణ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ బాలరాజు,నర్సింహారెడ్డి, వెంకటేష్, రూప, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి,మాజీ కారదర్శి నర్సిములు, సాయినాథ్, జిల్లాలోని పిఈటిలు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి లక్ష్యం... ప్రజల సౌకర్యమే ధ్యేయం

- రాంరెడ్డి పల్లిలో 50 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- సర్పంచ్ శివలీల ఆంజనేయులు



**ఉర్కొండ, జూలై 31 (జనంసాక్షి);** ఉర్కొండ మండలంలోని రామ్‌రెడ్డి పల్లి గ్రామంలో సుమారు 50 లక్షల రూపాయల తోలి చేపట్టనున్న అభివృద్ధి పనులకు సర్పంచ్ శివలీల ఆంజనేయులు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ ఏఈ శివ కృష్ణతో పాటు గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. శంకుస్థాపన అనంతరం సర్పంచ్ శివలీల ఆంజనేయులు మాట్లాడుతూ, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు, గ్రామ పంచాయతీ భవనం ఆధునీకరణ వంటి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ నిధులను సక్రమంగా వినియోగించి నాణ్యమైన పనులు చేయించడానికి కృషి చేస్తామన్నారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పంచాయత్ రాజ్ ఏఈ శివ కృష్ణ సూచించారు. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

## ఆగస్టు 7న బీసీల బెంగళూరు బాట

- 11వ అఖిల భారత ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరణ..
- భారీగా హాజరుకావాలని అనిల్‌కుమార్, గొడుగు బాలచందర్ పిలుపు



**కల్వకుర్తి,జూలై 31, (జనంసాక్షి):** బెంగళూరులో ఆగస్టు 7న నిర్వహించనున్న అఖిల భారత 11వ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ కల్వకుర్తి పట్టణంలో శుక్రవారం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.బీసీ సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షుడు గొడుగు భానుచందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల పరిరక్షణ, జనాభా ప్రాతిపదికన హక్కులు,బీసీ కులగణన, విద్య,ఉద్యోగాలు,రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం వంటి ప్రధాన అంశాల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభను ప్రతి బీసీ సోదరుడు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రం నలుమూలల నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో హాజరై ఐక్యతను చాటాలని కోరారు.ఈ కార్యక్రమంలో సుధాకర్, పుట్ట వెంకయ్య, రామస్వామి, పర్వతాపురం గణేష్, చంద్రమౌళి, జంగయ్య, చిన్న గౌడ్, కొంక అరవింద్ గౌడ్, శివకృష్ణ, ఇస్లావత్ శివ, కావాలి కుమార్, హనుమంత్ శేఖర్, వీరభద్ర, గంగపురం తిరుమలేష్‌తో పాటు బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ం

## పెంట్లవెల్లిలో ఆర్ఎంపీ వైద్యుడు మల్లయ్య దారుణ హత్య

- నడిరోడ్డుపై కత్తులతో దాడి
- భూ వివాదాల కోణంలో పోలీసుల దర్యాప్తు



**పెంట్లవెల్లి, జూలై 31 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు డాక్టర్ మల్లయ్య (50) గుర్తు తెలియని వ్యక్తుల దాడిలో దారుణంగా హత్యకు గురయ్యారు. ఈ సంఘటనతో మండల ప్రజలు ఒక్కసారిగాభయాందోళనలకుగురయ్యారు.స్థానికుల కథనం ప్రకారం, శుక్రవారం రాత్రి గుర్తు తెలియని ఒక మహిళతో పాటు మరికొందరు వ్యక్తులు మల్లయ్య నిర్వహిస్తున్న వైద్యశాలకు వచ్చారు. అనంతరం వైద్యశాలలో ఉన్న మల్లయ్య కళ్లలో కారం చల్లి, ఆయనను బలవంతంగా బయటకు ఈడ్చుకొచ్చి రోడ్డుపైకి తీసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అనంతరం తమ వెంట తెచ్చుకున్నపదునైనఆయుధాలతోవిచక్షణారహితంగా దాడి చేసి, తీవ్రంగా పొడిచి హత్య చేసి అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం.నడిరోడ్డుపై జరిగిన ఈ దారుణ హత్యను చూసిన స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే సమీపంలో ఉన్న పెంట్లవెల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు.

మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు.ప్రాథమిక సమాచారం మేరకు మల్లయ్యకు కొంతకాలంగా భూ వివాదాలు ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆ వివాదాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగిన ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే హత్యకు గల అసలు కారణాలు ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఘటన జరిగిన ప్రాంతాన్ని పోలీసులు పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు.

## భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**• ఉర్కొండ ఎస్సై రమాదేవి హెచ్చరిక**



**ఉర్కొండ, జూలై 31, (జనంసాక్షి);** ఉర్కొండ మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉర్కొండ ఎస్సై రమాదేవిలి సూచించారు.
వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, వర్షపు నీరు నిల్వ ఉన్న చోట్ల పిల్లలు ఆడకుండా చూడాలని తెలిపారు. చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్ద నిలబడవద్దని, ప్రమాదకరమైన ప్రాంతాల్లోకి వెళ్లవద్దని హెచ్చరించారు.
రాత్రి వేళల్లో అత్యవసరం అయితేనే బయటకు రావాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే 100 నంబర్ లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్లపై నీరు నిలిచిన చోట వాహనాలు నడపవద్దని, రైతులు పొలాల వద్దకు ఒంటరిగా వెళ్లవద్దని సూచించారు.
పోలీసు సిబ్బంది గ్రామాల్లో గస్తీ నిర్వహిస్తున్నారని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై రమాదేవి పేర్కొన్నారు.

## ఉద్యోగుల ఉత్తమ సేవలు గుర్తుండిపోతాయి: జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూలై 31(జనంసాక్షి);**
జిల్లా అభివృద్ధిలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత తన వంతుగా కృషి చేశారని, ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఉద్యోగుల ఉత్తమ సేవలే ఎప్పటికీ గుర్తుండిపోతాయని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి నుషిత ఉద్యోగ విరమణ ఆత్మీయ అభినందన సన్మాన కార్యక్రమాన్ని శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్చార్జి అధికారిగా కూడా తన సేవలందించారని కొనియాడారు. శేష జీవితం ఆరోగ్యంగా, ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నుషిత దంపతులను కలెక్టర్ శాలువా, జ్ఞాపిక, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, బంధుమిత్రులు పెద్ద ఎత్తున హాజరై జ్ఞాపికలను



అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, సర్వే ఏడి నూకరాజు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, డిపిఓ శ్రీకాంత్, డిఐఈఓ హృదయ రాజ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మేరా యువ భారత్ - నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్ పోస్టర్ విడుదల

**జిల్లా ఎస్పీ డి.జానకి**

**మహబూబ్‌నగర్ రూరల్ జూలై 31(జనం సాక్షి):** యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా చైతన్యపరిచి, మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణానికి ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "మేరా యువ భారత్ – నషా ముక్త యువ ఫర్ వికసిత్ భారత్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా డి.జానకి, విడుదల చేశారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, యువత దేశ భవిష్యత్తుకు బలమైన శక్తి అని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. యువతలో అవగాహన పెంపొందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు.
ఈ కార్యక్రమంలో భాగంగా జానపద గీతా




లు, నృత్యం, నుక్కడ్ నాటక్ మైమ్, పెయింటింగ్, డిబేట్ ఎలోక్యూషన్, షార్ట్ ఫిల్మ్/రీల్స్, స్లోగన్ రచన, స్లామ్ పోయెట్రీ వంటి మొత్తం 8 పోటీ విభాగాల్లో యువత పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.
మహబూబ్‌నగర్ జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొని మత్తు పదార్థాల నిర్మూలనకు తమవంతు సహకారం అందించాలని జిల్లా ఎస్పీ డి.జానకి,పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబ్నగర్ ఉమ్మడి జిల్లా యువజన అధికారి తోటా నాయక్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు అనిల్ కుమార్, రాజేందర్ గౌడ్ ఇతరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10న జరిగే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**• సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు**



**నాగర్‌కర్నూల్, జూలై 31 (జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను అదేవిధంగా విబిజిరామ్ లోని లొసగులను సరిచేయాలని రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న నిర్వహించే జైలు భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పర్వతాలు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని గౌరిట గుమ్మకొండ, పోతిరెడ్డి పల్లి, తిమ్మాజిపేట తదితర గ్రామాలలో కార్మికులను కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోర్టుల ద్వారా కార్మిక వర్గాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టే పరిస్థితి ఏర్పడిందని కనీస వేదన చట్టాన్ని కూడా తుంగలోకి తొక్కే పరిస్థితి ఉందని అన్నారు. వివిజి రాంజీ పథకం ద్వారా వ్యవసాయ కూలీల పొట్టను కొట్టే పరిస్థితి ఉందని అన్నారు. విద్యుత్ చట్టం ద్వారా రైతులపై మళ్లీ విద్యుత్ బారాలు మోపే పరిస్థితి ఉందని అన్నారు. వీటికి వ్యతిరేకంగానే జైలు బరో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్మికులు కర్షకులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్, సిఐటియు జిల్లా నాయకురాలు సుమతి, సలేశ్వరం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ అనంతరం కుటుంబంతో సంతోషంగా ఆరోగ్యంగా జీవించాలి

**• జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు**



**గద్వాల నడిగడ్డ,జులై 31(జనంసాక్షి);** సమాజ శాంతి భద్రతల పరిరక్షణ కోసం నాలుగు దశాబ్దాల పాటు పోలీస్ శాఖలో అంకిత భావంతో సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఆర్ ఎస్సై టి. ఆంజనేయులుకు జోగుళాంబ గద్వాల జిల్లా పోలీస్ శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు ఆయనను పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు తమ కుటుంబ క్షేమం కంటే సమాజ క్షేమానికే ప్రాధాన్యతనిస్తూ నిరంతరం విధులు నిర్వర్తిస్తారని అన్నారు. దాదాపు 40 సంవత్సరాల సుదీర్ఘ పోలీస్ సేవలో 7 సంవత్సరాలు జోగుళాంబ గద్వాల జిల్లాలో విధులు నిర్వహించిన టి. ఆంజనేయులు, 2019లో ఏఆర్ ఎస్సై గా పదోన్నతి పొంది జిల్లాకు వచ్చారని తెలిపారు. సుదీర్ఘ సర్వీస్‌లో ఎలాంటి రిమార్కులు లేకుండా, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం ఆయన నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పోలీస్ ఉద్యోగం అంటే కేవలం ఒక వృత్తి కాదని, ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసే బాధ్యత అని ఎస్పీ అన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన ఇలాంటి పోలీస్ అధికారి రాబోయే తరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. వారి సేవల వెనుక కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో కీలకమని అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందుతున్న టి. ఆంజనేయులు గారు పోలీస్ శాఖలో తనకు లభించిన సహకారాన్ని, సహచర అధికారులు సిబ్బంది అందించిన ప్రోత్సాహాన్ని గుర్తుచేసుకుంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. శంకర్,ఏఆర్ డీఎస్పీ నరేందర్ రావు, కార్యాలయ ఏఓ పి.సాయి కృష్ణ, కార్యాలయ సిబ్బంది, రిటైర్మెంట్ పొందుతున్న అధికారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో పాడి గేదె మృతి



**చేర్యాల, జూలై 31 (జనంసాక్షి):** చేర్యాల మండలం వీరన్నపేట గ్రామంలో శుక్రవారం విషాదం చోటు చేసుకుంది. గ్రామ రైతు కేసిరెడ్డి నరసింహారెడ్డి రోజు మాదిరిగా తన పశువులను మేతకు విడువగా అందులో ఒక పాడి గేదె సుమారు రూ. 1 ఒక లక్ష ట్రాన్స్ నష్టం వాటిల్లిందని వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాన్స్ ఫార్మర్ దగ్గర ఉన్న తీగలకు తగిలి మృతి చెందింది. పాల పై ఆధారపడి ఉన్న కుటుంబం పాడి గేదె చనిపోవడంతో జీవనాధారం కోల్పోయామని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు విచారణ జరిపి, ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

## విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం




**అయిజ, జులై 31 (జనంసాక్షి):** అయిజ మండలంలో జిల్లా బిజెవైఎం అధ్యక్షుడు బాబుల్ రెడ్డి ఆధ్వర్యంలో సాయి తేజ ఒకేషనల్ జూనియర్ కాలేజ్ ,అరోరా జూనియర్ కాలేజ్ లో నిర్వహించిన ఫీజుల బకాయి,–బిజెపి లడాయి కార్యక్రమం భాగంగా విద్యార్థుల సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ. ఫీజు రీయింబర్స్మెంట్ ఆలస్యం వల్ల వేలమంది విద్యార్థుల చదువులు, ఉద్యోగ అవకాశాల్లో నష్టపోతున్నారని అన్నారు. మూడేళ్లుగా రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అయిజ పట్టణ అధ్యక్షుడు నరసింహ, మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ,గద్వాల పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ ,జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమత మధు గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్,రాష్ట్ర ఓబీసి మోర్చా అధ్యక్షుడు సద్దాల కృష్ణ,అంజి, వర్మ,బిజెవైఎం నాయకులు సాయి,పాండు, సతీష్,తదితరులు ఉన్నారు..

## లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలి

**• జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**సంగారెడ్డి బ్యూరో, జూలై 31(జనంసాక్షి):** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలను గుర్తించి పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వైద్య, వ్యవసాయ, పశుసంవర్ధక తదితర శాఖల అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. భారత వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వచ్చే వారంలో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున జిల్లాలోని అన్ని శాఖల అధి



కారులు పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.